మనసులో మాట
KANCHARLA
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
శనివారం 30 మే 2026 పేజీ : 16

# క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు 6లో..





# అమరుల త్యాగాలను మరువం

- ఆ కుటుంబాలకు సర్కార్ అండ!
- మహిళా కమిషన్ సభ్యులు శంకరమ్మ, శ్వేతలకు సన్మానం
- శ్రీకాంతాచారి తల్లి, చాకలి ఐలమ్మ వారసురాలికి సముచిత స్థానం
- ప్రతి నియోజకవర్గంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్
- మోత్కూర్‌లో మంత్రి అడ్లూరి వెల్లడి


4

# మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రూ. 56 కోట్ల విలువైన చెక్కులను అందజేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతల్లో 60 శాతం మహిళా సంఘాలకే ప్రాధాన్యం
- జిల్లాలో ప్రతి మండలానికి ఒక రైస్ మిల్లు, ఎరువుల దుకాణాలు కేటాయించాలని ప్రభుత్వ విప్ సూచన

## అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

- చివరి గింజ వరకు కొంటాం
- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు
- వివరాలు వెల్లడించిన మంత్రులు

వివరాలు 5లో..




## కాసర్ల పద్మకు కెటిఆర్ నివాళి

పార్థివ దేహం వద్ద పుష్పాంజలి


2

## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత



వివరాలు 2లో..

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు

వివరాలు 3లో..




# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది?

- యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం


3

# రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

- సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం
- ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి
- రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు: మంత్రి తుమ్మల

6



## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత

**హైదరాబాద్, మే 29 (మనసులో మాట):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్?లో పని చేసిన ఆయన 2016 ఏప్రిల్ 29ను హస్తం పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరారు. నాలుగేండ్ల తర్వాత టీడీపీకి రిజైన్ చేసి 2020 మార్చి 16న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వయోభారం, అనారోగ్య సమస్యతలతో గత కొద్ది రోజులుగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

## కాసర్ల పద్మకు కెటిఆర్ నివాళి

### పార్థివ దేహం వద్ద పుష్పాంజలి

**రాజన్న సిరిసిల్ల, మే 29:** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. గుండెపోటుతో కాసర్ల పద్మ మరణించారనే వార్త తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ నుంచి బయల్దేరి ఆయన సిరిసిల్లకు వచ్చారు. అనంతరం కాసర్ల పద్మ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కాసర్ల పద్మకు ఘనంగా నివాళు లర్పించారు. కాసర్ల పద్మ 2020లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పటి మున్సిపల్ ఎన్నికల్లో 27వ కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పటికీ ఆమె ఓడిపోయారు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. పది రోజుల కిందట కాసర్ల పద్మ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆమె మరణించారు. పద్మ మృతి పట్ల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, పాలకవర్గం, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. కాగా, ఆమెకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం..

- రూ. 56 కోట్ల విలువైన చెక్కులను అందజేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతల్లో 60 శాతం మహిళా సంఘాలకే ప్రాధాన్యం
- జిల్లాలో ప్రతి మండలానికి ఒక రైస్ మిల్లు, ఎరువుల దుకాణాలు కేటాయించాలని ప్రభుత్వ విప్ సూచన



**రాజన్న సిరిసిల్ల, మే 29 (మనసులో మాట):** రాష్ట్రంలోని మహిళా లోకాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్‌లో మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) సభ్యులకు మెగా బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మొత్తం 337 సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ. 40 కోట్లు, 42 సంఘాలకు ఎఫ్ పీసీ, ఎఫ్ పీజీ సీఐఎఫ్ కింద రూ. కోటి 5 లక్షలు, 278 సంఘాలకు శ్రీనిధి రూరల్ కింద రూ. 7 కోట్ల 13 లక్షలు అందజేశారు. అలాగే మెప్మా పరిధిలోని 55 సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ. 6 కోట్ల 33 లక్షలు, 61 శ్రీనిధి మెప్మా సంఘాలకు రూ. కోటి 50 లక్షల విలువైన చెక్కులతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు విజయవంతంగా నిర్వహించిన సంఘాలకు రూ. 11,36,113 ల కమిషన్ చెక్కులను వారు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల స్టాళ్లను వారు ఆసక్తిగా తిలకించి అభినందించారు. ఈ మహా సభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత మార్చి 6న ప్రారంభించిన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యాచరణ భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు ఎంతో దోహదపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రికార్డు స్థాయిలో రూ. 57వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేయడమే కాకుండా, వాటికి సంబంధించిన వడ్డీని కూడా ప్రభుత్వమే తిరిగి చెల్లించిందని గుర్తుచేశారు. ప్రతి మహిళను కోటీశ్వరురాలిని చేయాలన్న సంకల్పంతోనే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో 60శాతం బాధ్యతలను మహిళా సంఘాలకే అప్పగించామన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేస్తున్నామని, అందులో భాగంగా సిరిసిల్లలోనే 37 వేల మందికి అందజేస్తున్నామని, త్వరలోనే రెండో దశ కింద మరో కోటి చీరల తయారీకి ఆర్డర్లు ఇచ్చామని వెల్లడించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న బస్సుల ద్వారా ప్రతి నెలా రూ. 68వేల ఆదాయం సమకూరుతోందని, రానున్న రోజుల్లో ప్రతి మండలానికి ఒక రైస్ మిల్లుతో పాటు ఎరువుల దుకాణాలను కూడా మహిళలకే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మన రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని కేరళ సైతం అనుసరిస్తోందని కొనియాడారు. కేవలం మహిళా సంక్షేమమే కాకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు రూ. 5లక్షల ఆర్థిక సహాయంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేశామని, జూన్ 2 తర్వాత మరిన్ని ఇండ్లు మంజూరు కానున్నాయని చెప్తూ, మహిళలు రాజకీయ రంగంలోనూ రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 10 ముఖ్యమైన థీమ్‌లతో 10 శాఖల ద్వారా ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై విస్తృత అవగాహన కల్పించామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళా సంఘాలు బ్యాంక్ రుణాల చెల్లింపుల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఉత్తమ అవార్డును దక్కించుకున్నాయని ప్రశంసించారు. ఈరుణాలను కేవలం గృహ అవసరాలకే పరిమితం చేయకుండా తినుబండారాల తయారీ, కిరాణా దుకాణాలు, మగ్గం వర్క్ వంటి స్వయం ఉపాధి రంగాల్లో పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా ఎదగాలని కోరారు. రానున్న రోజుల్లో మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వృద్ధ మహిళలతో పాటు కిశోర బాలికల కోసం కూడా ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేసి వారికి బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన పెంచుతామన్నారు. స్కూల్ యూనిఫాంల తయారీ, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు బాధ్యతలను మహిళలకే అప్పగించామని, కొత్తగా స్వయం ఉపాధి ఆలోచనలతో వచ్చే మహిళలకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రగతి సదస్సులో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వీర్నపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, తహసీల్దార్ మహేష్ మరియు పెద్ద సంఖ్యలో మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

**హైదరాబాద్,మే29,(మనసులో మాట):** రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో–కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు.

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

- యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ,మే29,(మనసులో మాట):** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్‌సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ ఛైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు.



వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

# తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

## వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు

**హైదరాబాద్, మే 29:** తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జులై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.

# ఫేక్ జీవోలతో భూ ఒప్పందాలు

- నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భమికి ఎసరు
- నకిలీ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

**మేడ్చల్,మే29,(మనసులో మాట):** ఫేక్ జీఓలు, అక్రమ భూ ఒప్పందాల ద్వారా భారీ మోసానికి పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహా మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గండిపేట సర్వే నెంబర్ 18లోని ప్రభుత్వ భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమిని తమదిగా చూపిస్తూ ఫేక్ జీఓలు తయారు చేసినట్లు దర్యాప్తులో తేలింది. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఈ నకిలీ జీఓలను వైరల్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వం భూమిని క్రమబద్ధీకరించినట్లు చెబుతూ ఐదు ఫేక్ జీఓలను సృష్టించిన నిందితులు, ఆ భూమిని ఎకరాకు రూ.3.5 కోట్లకు అమ్మేందుకు కుట్ర చేసినట్లు సమాచారం. ఈ భూమి డీల్‌లో బొల్లా రమేష్, బ్రహ్మనాయుడుతో ఒప్పందం కుదిరినట్లు దర్యాప్తులో బయటపడింది. బొల్లా బ్రహ్మనాయుడుకు నిమ్మల కుటుంబం నుండి రెండు విడతలుగా డబ్బు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు తెలిపారు. ఒకసారి కోటి రూపాయలు, మరోసారి 25 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించారు. మొత్తం భూ లావాదేవీల్లో సుమారు నాలుగు కోట్లు చేతులు మారినట్లు దర్యాప్తులో తేలింది. కోర్టు ఆదేశాలతో నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి, బ్యాంక్ పాస్‌బుక్స్, మొబైల్స్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. చట్టబద్ధ హక్కులు లేకపోయినా ప్రభుత్వ పోరంబోకు భూమిపై హక్కులు ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. హైకోర్టులో తమ భూమే అని నిందితులు పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ, అక్టోబర్ 2025లో వాటిని కోర్టు కొట్టివేసినట్లు తెలిపారు. అనంతరం కూడా అక్రమంగా భూమి అమ్మకానికి ప్రయత్నించినట్లు పోలీసులు చెప్పారు. ఫేక్ జీఓలు, ఫోర్జరీ పత్రాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. భూమి కొనుగోలు చేసే ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.

# పెనుగంగలో పడి బాలుడు మృతి

**ఆదిలాబాద్, మే29 :** ఆదిలాబాద్ జిల్లాలోని బేల మండల కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. గంగమ్మ తల్లికి బోనం సమర్పించుకునేందుకు తన నానమ్మ బంధువులతో మండలంలోని సాంగిడి గ్రామ పెనుగంగ వద్దకు శుక్రవారం బోనం సమర్పించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో బెతం సాయిదీప్ (14) బాలుడు పెనుగంగా వాగులో స్నానం చేస్తూ నానమ్మ, బంధువులు చూస్తుండగానే నీటి గుంతలోకి జారుకున్నాడు. దీంతో బాలుడిని కాపాడేలోపే మునిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెనుగంగా వద్దకు చేరుకొని బాలుడు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



## పెరటికోళ్ల పెంపకానికి నిధులు మంజూరు

ఖమ్మం,మే29:

ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక మహిళ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఐకేపీ ఆధ్వర్యంలో కరకగూడెం మండలంలోని 27 గ్రామ సమాఖ్యలలోని 275 మంది సభ్యులకు రూ. 5. 50 లక్షలు పెరటి కోళ్ల పెంపకం నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులకు సంభందించిన చెక్కును శుక్రవారం మండల కేంద్రంలోని టీజీబీ బ్యాంక్ కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్ ఎన్.గిరిబాబు, ఐకేపీ ఏపీఎం బండి వినోద్ క్రాంతి గ్రూప్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎపీఎం వినోద్ క్రాంతి మాట్లాడుతూ.. పెరటికోళ్ల పెంపకంతో మహిళలు దినదిన అభివృద్ధి చెందుతూ ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు పోలెబోయిన విజయలక్ష్మి, సత్యనారాయణ, అకౌంటెంట్ ప్రీతి, సమాఖ్య ప్రతినిధి మహేశ్వరి పాల్గొన్నారు.

## వివోలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్

### వివోల నిరవధిక దీక్షలకు బిఆర్ఎస్ మద్దతు

**నిజామాబాద్,మే29,(మనసులో మాట):**

ఎన్నికల హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కేసిందని, వీవోఏలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించి మోసం చేసిందని బీఆర్ఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న వీవోఏ ల నిరవధిక సమ్మెకూ కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. వీవోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు బీఆర్ఎస్ తరుపున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. 2023 లో అసెంబ్లీ సాక్షిగా నాటి ఎమ్మెల్యే ప్రస్తుతం మంత్రి సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీవోఏ ల సమస్యలపై ప్రశ్నించారని, ఆనాడు ప్రశ్నించిన సీతక్క ఇప్పుడు అదే శాఖ సంబంధించిన మంత్రి ఉన్నారని, ఆనాటి సమస్య నేడు గుర్తుకు రావడం లేదా అని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికార పక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీవోఏలకు సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ట్యాబ్ తోపాటు నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీ లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, రూ. 20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి విశేష సేవలు అందిస్తున్న వివో ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనియెడల బీఆర్ఎస్ తరపున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# అమరుల త్యాగాలను మరువం..

- ఆ కుటుంబాలకు సర్కార్ అండ!
- మహిళా కమిషన్ సభ్యులు శంకరమ్మ, శ్వేతలకు సన్మానం
- శ్రీకాంతాచారి తల్లి, చాకలి ఐలమ్మ వారసురాలికి సముచిత స్థానం
- ప్రతి నియోజకవర్గంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్
- మోత్కూర్‌లో మంత్రి అడ్లూరి వెల్లడి





**మోత్కూర్ ,(మనసులో మాట):**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులుగా నూతనంగా నియమితులైన కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేతలకు శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్‌లో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### త్యాగధనులకు సముచిత గౌరవం..

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. స్వరాష్ట్రం సిద్ధిస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయని, అన్ని వర్గాల ప్రజల బతుకులు మారుతాయని నమ్మి ఎందరో వీరులు ప్రాణత్యాగం చేశారన్నారు. తొలిదశ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ, మలిదశ ఉద్యమంలో అమరుడు శ్రీకాంతాచారి చేసిన త్యాగాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమరుల కుటుంబాలను ఆదుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగానే ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గద్దర్, అందెశ్రీలతో పాటు పలువురికి ప్రభుత్వం పారితోషకం అందించి గౌరవించిందని తెలిపారు.

### శంకరమ్మ కడుపుకోత తీర్చిన రేవంత్ సర్కార్..

మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ కడుపుకోతను గుర్తించిన ముఖ్యమంత్రి, ఆమెకు మహిళా కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు అప్పగించారని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా తొలిదశ ఉద్యమ స్ఫూర్తి, వీరనారి చాకలి ఐలమ్మ వారసురాలు చిట్యాల శ్వేతను సైతం మహిళా కమిషన్‌లో నియమించి ఉద్యమకారుల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవాన్ని చాటుకున్నామన్నారు. నూతన సభ్యులిద్దరూ రాష్ట్రంలోని మహిళల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని మంత్రి కోరారు.

### నియోజకవర్గానికి ఒక 'ఇంటిగ్రేటెడ్ స్కూల్'..

ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి అడ్లూరి తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఒక 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' నిర్మాణానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి పిలుపునిచ్చారు.

# ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

## కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం



**హైదరాబాద్,మే29,(మనసులో మాట):**

రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.

# కోహెడ ఫ్రూట్ మార్కెట్ బాధితులకు న్యాయం చేయాలి

● కలెక్టర్‌కు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి వినతి



**రంగారెడ్డి, (మనసులో మాట):** రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధి లోని కోహెడ గ్రామంలో ప్రతిపాదిత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం నేపథ్యంలో భూములు కోల్పోతున్న రైతుల తరఫున రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులతో పాటు కలెక్టర్‌ను కలిసిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం ఇప్పటికే కేటాయించిన భూమిని పక్కనబెట్టి, ప్రస్తుతం సర్వే నం. 167/1లో సుమారు 264 ఎకరాల భూమిని తీసుకుంటున్న సందర్భంగా.. ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సుమారు 160 మంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధంగా నష్టపరిహారం అందించి, రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. జూన్ 03వ తేదీన ఫ్రూట్ మార్కెట్‌కు శంకుస్థాపన జరగనున్నట్లు సమాచారం ఉన్నందున, ఆలోపు ఈ పేద రైతుల జీవన భద్రతను పరిరక్షించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యపై ప్రశ్నిస్తున్న అమాయక రైతులపై అరెస్టులు, బెదిరింపులు, దాడుల వంటి చర్యలకు పాల్పడకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# బీఎల్‌ఏల నియామకంలో జాప్యం వద్దు

● రాజకీయ పార్టీలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరిక



**నిజామాబాద్ (మనసులో మాట):** నిజామాబాద్ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ అమలులో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్‌ఏలు) నియామకంలో రాజకీయ పార్టీలు ఆలస్యం చేయవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. పారదర్శక ఓటరు జాబితా తయారీకి బీఎల్‌ఏల పాత్ర కీలకమని పేర్కొంటూ, నిర్ణీత ఫార్మాట్‌లో వెంటనే వారి వివరాలు సమర్పించాలని హితవు పలికారు. జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు ఒకే రాజకీయ పార్టీ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బీఎల్‌ఏల వివరాలు మాత్రమే అందించిందని తెలిపారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్‌ఏలకు శిక్షణ, ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాల నమోదు వంటి బాధ్యతలు ఉన్నాయని వివరించారు. అదేవిధంగా, ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని ఈఆర్‌ఓలకు ఆదేశించారు. బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే ద్వారా చనిపోయిన, వలస వెళ్లిన, డూప్లికేట్ ఓటర్లను గుర్తించేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. మ్యాపింగ్, ఆన్లైన్ డేటా నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా సాంకేతిక సిబ్బందిని వినియోగించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఎస్‌ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

● కలెక్టర్లు, అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమీక్ష



**నిజామాబాద్,(మనసులో మాట):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ఓటరు మ్యాపింగ్, శిక్షణ కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని సూచించారు. మరణించిన, వలస వెళ్లిన, డూప్లికేట్ ఓటర్ల పేర్ల తొలగింపుతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల కాగా, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు సీఈఓ తెలిపారు.



# అర్హులందరు ఓటరు జాబితాలో చేర్చాలి

**హైదరాబాద్, (మనసులోమాట):** అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరును ఓటరు జాబితాలో చేర్చాలని, అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించాలని భారత ఎన్నికల సంఘం త్వరలో రాష్ట్రంలో నిర్వహించే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయంలో అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్) పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎన్నికల అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, బీ ఎల్ ఓ సూపర్ వైజర్లు తదితర ఎన్నికల అధికారులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇఓ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ అధికారుల బాధ్యతలపై, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఐటీ సంబంధిత కార్యకలాపాల గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి ప్రక్రియకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను, అలాగే ఎస్ ఐ ఆర్ అమలు ప్రక్రియలో ఉండే దశలు, విధానాలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఐ టీ ప్రాజెక్ట్ మేనేజర్ మాడ్యూల్స్, ఎస్ ఐ ఆర్ దశలు – ప్రీ డ్రాఫ్ట్, పోస్ట్ డ్రాఫ్ట్, బీఎల్ ఓ యాప్, సాంకేతిక అంశాలు, ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఎలా నింపాలో వంటివి వివరించారు. అలాగే ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పలువురు అధికారులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా డిప్యూటీ సీఈఓ (ఎఫ్ ఏ సీ), సీఈఓ కార్యాలయ రాష్ట్ర నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బంది కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే ధన్‌పాల్

**ఇందూరు, (మనసులో మాట):** బీజేపీ భావజాలంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని బోర్గాంలో నిర్వహించిన బీజేపీ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణా తరగతుల రెండో రోజు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సమయంలోనే కాకుండా ఎప్పటికప్పుడు సమాజంలో పార్టీ కార్యక్రమాలు కొనసాగించేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. పార్టీ అనుబంధ సంస్థలతో సమన్వయం పెంచుకుని ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా పెరిగిందని, కేంద్ర పథకాలు గ్రామస్థాయి వరకు చేరుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి, కర్ణాటక బెల్గావి ఎమ్మెల్యే అభయ్ పాటిల్ హాజరుకాగా, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆయనను ఘనంగా సన్మానించారు.



# మహనీయుల విగ్రహాల ఏర్పాటులో ఇబ్బందులు తొలగించాలి

**అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి అడులూరి లక్ష్మణ్ కుమార్**

**నిబంధనలకు విరుద్ధమైన స్థలాలపై ముందే నోటీసులు ఇవ్వాలని ఆదేశం**


**దళిత సంఘాల నాయకులపై అనవసరంగా కేసులు పెట్టవద్దని స్పష్టీకరణ**

**హైదరాబాద్, (మనసులో మాట):** మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు (మంత్రి హోదా) అడులూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఆయన అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటు విషయంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధమైన స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయాలని చూస్తే, ఆయా స్థలాలపై ముందే నోటీసులు జారీ చేయాలని, అంతేగానీ చివరి నిమిషంలో వచ్చి అభ్యంతరాలు పెట్టవద్దని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే దళిత సంఘాల నాయకులపై అనవసరంగా కేసులు పెట్టవద్దని ఆదేశించారు. ప్రజల భావోద్వేగాలను, సెంటిమెంట్లను అధికారులు గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్ రావ్ ఆశయాలే తమ ప్రభుత్వానికి మార్గదర్శకాలని చెప్పారు. సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. మహనీయుల విగ్రహాలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని, అందువల్ల వివాదాలకు తావులేకుండా సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల ఉన్నతాధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఓపెన్ ప్లాటులో చెత్తాచెదారం

**ఇబ్బందుల్లో స్థానికులు**

**కరీంనగర్ టౌన్,(మనసులో మాట) :** కరీంనగర్ నగరపాలక సంస్థ (బల్దియా) పరిధిలోని 42వ డివిజన్‌లో ఉన్న ఓపెన్ ప్లాటు నివాసితులకు నరకంగా మారింది. సమీప ప్రాంతాల వారు ఇక్కడ చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్లిన ఆహార పదార్థాలను పారేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీనివల్ల స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై సదరు ప్లాటు యజమానికి ఫిర్యాదు చేసినా స్పందించకపోగా.. "మీలాంటి వారిని చాలా మందిని చూశాను, ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ దురుసుగా సమాధానం ఇస్తున్నాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయానికి సమీపంలోనే ఈ ఓపెన్ ప్లాటు ఉండడం గమనార్హం. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, ఆ ప్లాటును శుభ్రం చేయించడంతో పాటు యజమానిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# ఎబోలా... జాగ్రత్తగా ఉంటే పోలా

- ఎబోలాను ఎదుర్కొనేందుకు 'గాంధీ' సిద్ధం: 8 గదుల్లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డు
- గాలి ద్వారా వైరస్ వ్యాప్తి కాదు.. బాడీ ఫ్లూయిడ్స్ ద్వారానే సంక్రమణ
- భయాందోళన వద్దు.. ముందు జాగ్రత్తలతో ముప్పు తప్పించుకుందాం

**హైదరాబాద్,(మనసులోమాట):** ప్రపంచ దేశాలను వణికిస్తున్న ఎబోలా వైరస్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌తోపాటు తెలంగాణ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఎబోలా స్టేట్ నోడల్ సెంటరైన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో 8 గదుల్లో 20 పడకలతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు, వైద్యసేవలు అందించేందుకు అవసరమైన పీపీఈ కిట్లు అందుబాటులోకి తెచ్చింది. స్టేట్ నోడల్ ఆఫీసర్, గాంధీ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొ. సునీల్‌కుమార్ పలు అంశాలపై ప్రజలను అప్రమత్తం చేశారు. దేశంతోపాటు తెలంగాణలో ఎబోలా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు కానప్పటికీ ముందు జాగ్రత్తలతో ముప్పును తప్పించుకోవచ్చని వివరించారు. మధ్య ఆఫ్రికాలోని కాంగో, సూడాన్, ఉగాండ దేశాల్లో ఎబోలా వైరస్ ప్రభావం అత్యంత తీవ్రంగా ఉందని, ఆయా దేశాల నుంచి వచ్చే ప్రయాణీకులకు మన దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నారని, దీనిలో హైదరాబాద్‌లోని శంషాబాద్ ఒకటన్నారు. వైరస్ లక్షణాలు కనిపిస్తే 21 రోజులు హోంఐసోలేషన్‌లో ఉండాలని సూచించారు.

**ఇవీ ఎబోలా వైరస్ లక్షణాలు...**

ఎబోలా వైరస్ సోకిన 21 రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు ఒక్కొక్కటిగా బయట పడతాయి. తీవ్రమైన జ్వరం, డయేరియా, గొంతు, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు, నీరసం, అబ్డామిన్ పెయిన్స్, బ్లీడింగ్, అంతర్గత రక్తస్రావంతోపాటు శరీరంలోని ప్రతి అవయవంపైన ప్రభావం చూపిస్తుంది. చివరిదశలో అపస్మారకస్థితికి చేరుకుని మృత్యువాత పడతారు. గబ్బిలాల ద్వారా సంక్రమించే ఎబోలా కోవిడ్ వైరస్ కంటే ప్రమాదకారి. మరణాల శాతం ఎక్కువ. నివారణ, నియంత్రణకు ఇప్పటి వరకు సరైన ముందులు కనుగొనలేదు. సపోర్ట్ ట్రీట్‌మెంట్ మాత్రమే అందుబాటులో ఉంది.

**బాడీ ఫ్లూయిడ్స్ ద్వారా వైరస్ వ్యాప్తి**

కోవిడ్ మాదిరిగా గాలి ద్వారా కాకుండా బాడీ ఫ్లూయిడ్స్ ద్వారా ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ ఇతరులకు అంత తొందరగా స్ప్రెడ్ జరగదు. రక్తం, మూత్రం, మలం, లాలాజలం, ఎంగిలి, ఓరల్ సెక్స్‌వంటివి ఈ వైరస్ వ్యాప్తికి ప్రధాన కారకాలు. వీటిని నివారించగలిగితే ముప్పును తప్పించుకున్నట్లేనని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

**భయాందోళన వద్దు.. ఎదుర్కొనేందుకు సిద్ధం : ప్రొ. సునీల్‌కుమార్, ఎబోలా స్టేట్ నోడల్ ఆఫీసర్**

ఎబోలా వైరస్ ఎప్పటి నుంచో ఉంది. ఇటీవల కాలంలో ఆఫ్రికా దేశాల్లో విజృంభిస్తోంది. తెలంగాణలో ఎబోలా పాజిటివ్, లక్షణాల కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. వైద్యమంత్రి దామోదర రాజనర్సింహా, వైద్య ఉన్నతాధికారులు సలహాలు, సూచనల మేరకు గాంధీ సూపరింటెండెంట్ ప్రొ.వాణి నేతృత్వంలో నోడల్ సెంటరైన గాంధీఆస్పత్రిలో అన్ని సౌకర్యాలతో ఐసోలేషన్ వార్డు, పీపీఈ కిట్లు అందుబాటులో ఉన్నాయి. నర్సింగ్, శానిటేషన్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎబోలా వైరస్ వ్యాప్తిలో ఉన్న దేశాల నుంచి వచ్చే ప్రయాణీకులను శంషాబాద్ ఎయిర్ పోర్టులో స్క్రీనింగ్‌టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. లక్షణాలు కనిపిస్తే ఆర్‌టీపీసీఆర్, ఎలిషా టెస్ట్‌లు నిర్వహించి శాంపిల్స్‌ను పూణేలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపిస్తాం. దేశంలో ఢిల్లీ, చెన్నై, బెంగుళూరు, త్రివేండ్రం, కలకత్తా, అహ్మాద్‌బాద్ వంటి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులు ఉన్న ఎనిమిది నగరాలను నోడల్ సెంటర్లుగా గుర్తించగా అందులో హైదరాబాద్ ఒకటి.

# మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఇంద్రవెల్లిలో రూ. 30 లక్షల వ్యయంతో సోయా ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- మండల సమైక్య మహిళా సంఘాలకు రూ. 29 లక్షల చెక్కుల పంపిణీ



**మనసులో మాట, మే 29, ఆదిలాబాదు:** మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు - 2026" సంబరాల్లో భాగంగా శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన "సోయా ఉత్పత్తుల తయారీ కేంద్రం"ను స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) వెడ్మ బొజ్జుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మహిళా సంఘాలు, గుడిహత్నూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సోయాబీన్ పంట సాగు విస్తృతంగా ఉన్నప్పటికీ, స్థానిక ప్రాసెసింగ్ కేంద్రాలు తక్కువగా ఉండటం వల్ల రైతులు, మహిళలు ఆశించిన స్థాయిలో లబ్ధి పొందలేకపోతున్నారని గుర్తించి ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ సంస్థ 'ఇక్రిశాట్' సాంకేతిక భాగస్వామ్యంతో, 30 లక్షల రూపాయల వ్యయంతో ఈ సోయా ప్రాసెసింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. గతంలో ఇంద్రవెల్లి మండలంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల (మిల్లెట్) కేంద్రం తరహాలోనే, ప్రస్తుతం గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, సిరికొండ మండలాల్లో గ్రామీణ మహిళల ఉపాధి కోసం పెరటి కోళ్ల పెంపకం కేంద్రాలు, ఉట్నూర్‌లో ప్రత్యేక ఫలహారశాల (క్యాంటీన్) వంటి వినూత్న అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని వివరించారు. అదేవిధంగా ప్రారంభ బాల్య అభివృద్ధి పై అవగాహన కల్పిస్తూ, గర్భధారణ సమయం నుండి శిశువుకు రెండు సంవత్సరాలు నిండే వరకు ఉండే 1000 రోజులు జీవితానికి బలమైన పునాది వంటివని కలెక్టర్ తెలిపారు. ఈ కాలంలో పిల్లల ఎదుగుదల కోసం పోషకాహారం, ఆరోగ్యం, ప్రారంభ విద్య, స్పందనాత్మక సంరక్షణ, భద్రత, తల్లిదండ్రుల శ్రేయస్సు అనే 6 సూత్రాలను పాటించాలన్నారు. గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, బిడ్డ పుట్టిన 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత అనుబంధ ఆహారంతో పాటు సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది గ్రామస్థాయిలో దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. మహిళా సంఘాలను కేవలం రుణాలకే పరిమితం చేయకుండా పారిశ్రామికవేత్తలుగా మార్చడమే ప్రభుత్వ సంకల్పమన్న ఆయన, రానున్న రోజుల్లో ప్రభుత్వ గోదాములు, బియ్యం మిల్లుల (రైస్ మిల్లుల) నిర్వహణ బాధ్యతలను కూడా మహిళలకే అప్పగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. మహిళా సమాఖ్యల రవాణా, వ్యాపార అవసరాల కోసం ప్రతి మండల కేంద్రానికి ఒక ప్రత్యేక బస్సును కేటాయించబోతున్నామని, అలాగే ఇంధన విక్రయ కేంద్రాల (పెట్రోల్ బంకుల) ఏర్పాటుకు సైతం అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చరు

# గజ్వేల్‌లో ఉద్యమ స్ఫూర్తి గద్దె నిర్మాణానికి అనుమతివ్వాలి

- ముున్సిపల్ కమిషనర్‌కు తెలంగాణ రక్షణ సేన నాయకుల వినతి



**గజ్వేల్,(మనసులో మాట):** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పేలా గజ్వేల్ పట్టణంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో గద్దె నిర్మాణం చేపట్టేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ పార్టీ నాయకులు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి, లోక రవిచందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, అమరుల త్యాగాలు, రాష్ట్ర సాధన వెనుక ఉన్న పోరాట స్ఫూర్తిని యువతకు తెలియజేయాలనే లక్ష్యంతో గజ్వేల్ పట్టణంలో గద్దె నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఉద్యమాన్ని స్మరించుకునే వేదికగా ఈ గద్దె ఉపయోగపడుతుందని, ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు కూడా ఇది నశీశీవవస తోడ్పడుతుందని పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని అనుమతులు మంజూరు చేసి గద్దె నిర్మాణానికి సహకరించాలని కమిషనర్‌ను కోరినట్లు నాయకులు వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలు, తెలంగాణ భావజాల పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ఈ గద్దె కేంద్ర బిందువుగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి, లోక రవిచందర్‌తో పాటు స్థానిక నాయకులు మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, కర్రే రాజయ్య, అ నరేందర్ రెడ్డి, ఇంద్ర గౌడ్, శ్రీకాంత్, చందు కుమార్, రాజు, రవి ప్రసాద్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి

- తహశీల్దార్‌కు సీపీఐ నాయకుల వినతిపత్రం



**గన్నేరువరం(మనసులో మాట):** గన్నేరువరం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు సందర్శించారు. అనంతరం ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలపై మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో సీరియల్ ప్రకారం కాంటాలు వేయకుండా ఇష్టానుసారంగా తూకాలు వేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను నిలదీస్తే రైతన్నలతో వాగ్వివాదానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రాల్లో వడ్లు పోసి నెల రోజులు గడుస్తున్నా అధికారులు, నిర్వాహకులు పట్టించుకోవడం లేదని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని తెలిపారు. కాంటా వేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా, ఎలాంటి తరుగు (కటింగులు) లేకుండా ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొంతల అంజిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి చుక్కల శ్రీశైలం, సహాయ కార్యదర్శి కోన మల్లయ్య, గన్నేరువరం గ్రామ శాఖ కార్యదర్శి బోయిన మల్లయ్య, మండల నాయకులు న్యాత కొమురయ్య, నయీం, రాములు, కళ్లెం పోచయ్య, జాలి గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలు, రవాణా ప్రక్రియ వేగవంతం చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులకు, కాంట్రాక్టర్లకు హెచ్చరిక

**ఆదిలాబాదు మనసులో మాట:** జొన్నల అన్‌లోడింగ్ (దిగుమతి) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో జొన్నల కొనుగోలు, రవాణా, గోదాముల నిర్వహణ, హమాలీల కేటాయింపులపై సంబంధిత అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జొన్నల కొనుగోలుతో పాటు రవాణా, దిగుమతి ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రవాణా సజావుగా సాగేలా అవసరమైన లారీలను తక్షణమే సమకూర్చాలని, గోదాముల్లో తగిన ఏర్పాట్లు ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే హమాలీల కేటాయింపుల్లో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, అవసరమైన మేర హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాల ప్రకారం పనులు వేగవంతం చేయాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందులకు గురిచేసినా, విధుల్లో నిర్లక్ష్యం వహించినా ఎంతటి వారైనా సరే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని కాంట్రాక్టర్లను, అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో



అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రూ, రాజేశ్వర్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్ కుమార్, మార్కెటింగ్ అధికారి గజానంద్, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా కార్మిక శాఖ అధికారి ముత్యం, సిడబ్ల్యూసి మేనేజర్ రవి, అలాగే రవాణా, హమాలీ కాంట్రాక్టర్లు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు రూ. 53.10 కోట్ల భారీ రుణాల పంపిణీ!

**ప్రజా పాలన వారోత్సవాల్లో కలెక్టర్ దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు హలచల్**

**మహిళా సాధికారతకు పెద్దపీట; నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే**

**మహిళల ఉపాధి కోసం హెచ్‌పీ పెట్రోల్ బంక్ కేటాయింపు; కలెక్టరేట్‌లో మిన్నంటిన ఉత్సాహం**

**మనసులో మాట, మే 29, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు' శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు (SHG) రికార్డు స్థాయిలో రూ. 53,10,75,000/- (యాభై మూడు కోట్ల పది లక్షల డెబ్బై ఐదు వేల రూపాయలు) విలువైన రుణాల మెగా చెక్కును మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఐఏఎస్, మంచిర్యాల శాసనసభ్యులు (ఎమ్మెల్యే) కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కలిసి మహిళా ప్రతినిధులకు ఘనంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు, వారి ఆర్థిక వృద్ధికి అత్యంత పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే స్వయం సహాయక సంఘాల మహిళలకు మునుపెన్నడూ లేని విధంగా ఇంత భారీ ఆర్థిక చేయూతనిచ్చేలా రుణాలను మంజూరు చేశామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర వికాసమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళలకు మరింత స్థిరమైన ఉపాధిని, స్థానిక వసతులను పెంపొందించేలా ప్రత్యేకంగా నియోజకవర్గానికి 'హెచ్‌పీ (న్యూ) పెట్రోల్ బంక్' కూడా మంజూరైందని, దీనిని మహిళా సమాఖ్య ద్వారానే నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మంచిర్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా, ఆదర్శంగా నిలపడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఉద్ఘాటించారు.

## మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి: కలెక్టర్

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఈ భారీ రుణ ఆర్థిక సహాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని అద్భుతమైన కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి వ్యాపారాలు స్థాపించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మహిళల పాత్ర కీలకమన్నారు. కలెక్టరేట్ వేదికగా జరిగిన ఈ రుణాల పండుగ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీఆర్డీఓ (ఇ=ఇూ) కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్, హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల మహిళా సమాఖ్యల అధ్యక్షురాళ్లు, కార్యదర్శులు, వేలాది మంది మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు శాఖల అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# దగ్ధమైన మామిడి తోటను పరిశీలించిన కాంగ్రెస్ నేత అధికారుల సర్వే

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం; నష్టపరిహారం కోసం అధికారుల ముమ్మర సర్వే**

**- యశ్వంతరావుపేటలో రెండు ఎకరాల్లో బూడిదైన 70 మామిడి చెట్లు, డ్రిప్ పైపులు; కన్నీరుమున్నీరవుతున్న రైతు కుటుంబం**

**మనసులో మాట, జగిత్యాల బుగ్గారం:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేట గ్రామంలో గురువారం (మే 27న) చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదంలో పూర్తిగా అగ్నికి ఆహుతైన మామిడి తోటను శుక్రవారం బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. గ్రామానికి చెందిన పేద రైతు కుటుంబం బండ్ర భూమక్క కాంతయ్యలకు చెందిన రెండు ఎకరాల మామిడి తోటలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో.. సుమారు 70 కాపుకొచ్చిన మామిడి చెట్లతో పాటు లోపల ఉన్న లక్షలాది రూపాయల విలువైన డ్రిప్ ఇరిగేషన్ పైపులు కూడా పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో కుదేలైన రైతు కుటుంబ పరిస్థితిని నగునూరి నర్సగౌడ్ వెంటనే ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే, మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తక్షణమే స్పందించి బాధిత రైతుకు అండగా నిలవాలని, నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి గారి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సగౌడ్ ప్రమాద స్థలానికి చేరుకొని, దగ్ధమైన తోటను చూసి చలించిపోయారు. అక్కడి నుంచే ఆయన సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే సర్వే జరపాలని కోరారు.

**రంగంలోకి దిగిన రెవెన్యూ, వ్యవసాయ శాఖలు..**

మంత్రి, కాంగ్రెస్ నేతల పిలుపుతో వ్యవసాయ అధికారి (ఏఓ) అక్షిత, హార్టికల్చర్ (ఉద్యానవన) అధికారి వంశీకృష్ణ, స్థానిక రెవెన్యూ అధికారులు వెంటనే యశ్వంతరావుపేటలోని మామిడి తోట వద్దకు చేరుకున్నారు. కాలిపోయిన చెట్లను, డ్రిప్ లైన్లను పరిశీలించి ఎంత మేరకు నష్టం వాటిల్లిందనే అంశంపై క్షుణ్ణంగా సంయుక్త సర్వే చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్ట నివేదికను ఉన్నతాధికారులకు పంపి, బాధిత రైతు కుటుంబానికి గరిష్ట స్థాయిలో ప్రభుత్వ నష్టపరిహారం అందేలా చూస్తామని అధికారులు రైతుకు గట్టి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నగునూరి నర్సగౌడ్ మాట్లాడుతూ.. అకాల ప్రమాదంతో సర్వస్వం కోల్పోయిన రైతు కుటుంబానికి ప్రభుత్వం నుండి తగిన పారితోషికం, ఆర్థిక సాయం అందేలా తాను వ్యక్తిగతంగా మంత్రి గారి ద్వారా కృషి చేస్తానని, అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలన, సర్వే కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సగౌడ్ వెంట యశ్వంతరావుపేట గ్రామ ఉపసర్పంచ్ కోల శ్రీనివాసు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పెద్దనవేణి శంకర్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సమిత్, కోల గంగన్న, పొన్నం రాహుల్, బక్కన్న, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు బాధిత రైతులు పాల్గొన్నారు.



# నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోర్సులను వినియోగించుకోవాలి

- **ఉచిత నైపుణ్య శిక్షణపై అయిలాపూర్‌లో అవగాహన సదస్సు**
- **వసతి, భోజనంతో పాటు ఉచితంగా కోర్సు మెటీరియల్ పంపిణీ**



**కోరుట్ల (మనసులో మాట):** యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామంలో స్వయం ఉపాధి కోర్సులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సంస్థ అధ్యాపకులు మ్యాదరి రాకేష్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహకారంతో జగిత్యాల జిల్లాలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 19 నుండి 45 సంవత్సరాల వయస్సు కలిగి, పదో తరగతి చదివిన వారు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. సంస్థ ద్వారా మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీషియన్, పుట్టగొడుగుల పెంపకం, జ్యూట్ బ్యాగుల తయారీ, ఇమిటేషన్ జ్యువలరీ, సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, సెల్ ఫోన్ రిపేరింగ్, ఏసీ అండ్ ఫ్రిజ్ రిపేరింగ్, ఫోటో మరియు వీడియో గ్రాఫీ, హౌస్ వైరింగ్ వంటి కోర్సులను ఉచితంగా నేర్పిస్తున్నట్లు వివరించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతితో పాటు ఉచితంగా మెటీరియల్ అందించి, కోర్సు పూర్తయ్యాక సర్టిఫికేట్ ఇస్తామని తెలిపారు. అర్హులైన వారికి బ్యాంకు రుణాలు ఇప్పించడానికి కూడా కృషి చేస్తామని పేర్కొంటూ, ఆసక్తి గల నిరుద్యోగులు మరిన్ని వివరాల కోసం 9502869491 నంబరును సంప్రదించాలని కోరారు. అనంతరం అయిలాపూర్ గ్రామ సర్పంచ్ ధ్యావనపెల్లి రామకృష్ణ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఎన్నో మంచి కోర్సులు ఈ సంస్థ ద్వారా అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సొంతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వనపర్తి సౌమ్య, వార్డు సభ్యులు, మహిళలు, వీఓఏలు మరియు గ్రామ నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

- **జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో అధికారిక ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్ రాజర్షి షా**
- **జూన్ 1, 2 తేదీల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాలంకరణ**
- **ఎండ తీవ్రత దృష్ట్యా వేడుకల వద్ద తాగునీరు, నీడ, వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశం**

**ఆదిలాబాదు,(మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా, అధికారికంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జూన్ 2న జరిగే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన ఈ శుభదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రధాన వేడుక జరిగే కలెక్టరేట్ ప్రాంగణంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన నీడ సదుపాయం, తాగునీరు, వైద్య సహాయం అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. జూన్ 1, 2 తేదీలలో జిల్లాలోని అన్ని ముఖ్య ప్రభుత్వ కార్యాలయాలు, చారిత్రక కట్టడాలను విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు.




వేడుకల్లో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరణ, అమరవీరుల స్మారక స్తూపాల వద్ద నివాళులు అర్పించే కార్యక్రమాల్లో ప్రోటోకాల్‌ను కచ్చితంగా పాటించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

# బోయకొండ గంగమ్మ రాహుకాల అభిషేకానికి విశేష స్పందన


- **శాస్త్రోక్తంగా నివేదించిన వేద పండితులు; పెద్ద సంఖ్యలో పాల్గొన్న దంపతులు**
- **ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు విస్తృత మౌలిక వసతులు కల్పించిన ఆలయ ఈవో ఏకాంబరం**
- **పాత కల్యాణకట్ట వద్ద భక్తులకు ఉచిత అన్నదాన వితరణ**

**చౌడేపల్లి,(మనసులో మాట):** అన్నమయ్య జిల్లా, పుంగనూరు నియోజకవర్గం, చౌడేపల్లి మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన రాహుకాల అభిషేక మహోత్సవానికి భక్తుల నుండి విశేష స్పందన లభించింది. ఉదయాన్నే గంగమ్మ తల్లికి వివిధ రకాల పవిత్ర జలాలతో పంచామృతాభిషేకం నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్త దంపతుల సమక్షంలో రాహుకాల అభిషేకాన్ని శాస్త్రోక్తంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ రాహుకాల అభిషేకం చేయడం వల్ల గ్రహదోషాలు తొలగిపోవడమే కాకుండా, లోకం సుభిక్షంగా ఉంటుందని ఆలయ వేద పండితులు ఈ సందర్భంగా తెలిపారు. అభిషేకానంతరం పాత కల్యాణకట్ట వద్ద భక్తుల కోసం ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈవో, ఉప కమిషనర్ ఏకాంబరం పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చల్లని తాగునీరు, నీడ వంటి అన్ని రకాల మౌలిక వసతులను సమకూర్చారు. ఈ వేడుకలో ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ అమలులో తెలంగాణ టాప్

- దేశంలో సాగు చేసిన ఆయిల్ పామ్ విస్తీర్ణంలో 36 శాతం తెలంగాణదే
- జాతీయ సదస్సు-2026లో వెల్లడి
- రైతుల కృషి, ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైంది : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**హైదరాబాద్, (మనసులో మాట):** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ – ఆయిల్ పామ్ (చీవీజూ-ూ) కార్యక్రమం అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ వ్యవసాయ సదస్సు-2026లో కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి రాష్ట్రాల వారీగా ఆయిల్ పామ్ సాగు పురోగతిని వెల్లడించగా, తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు స్పష్టమైందన్నారు. NMEO.OP మిషన్ కింద 2021 నుండి 2026 వరకు దేశవ్యాప్తంగా 2,73,084 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేపట్టగా, అందులో 98,112 హెక్టార్లతో తెలంగాణ ఒక్కటే 36 శాతం వాటాను కలిగి ఉండటం రాష్ట్ర వ్యవసాయ రంగానికి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 1.16 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగవుతుండగా, 79,448 మంది రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. మంంత్రి మాట్లాడుతూ... ఈ విజయం కేవలం గణాంకాలకు మాత్రమే పరిమితం కాదన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలను స్వీకరిస్తూ ఆయిల్ పామ్ సాగు వైపు అడుగులు వేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. దేశంలో వంటనూనెల దిగుమతులపై ఆధారాన్ని తగ్గించి స్వయం సమృద్ధి సాధించాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు తెలంగాణ రైతులు విశేషంగా తోడ్పడుతున్నారని చెప్పారు. దేశంలో ఎడిబుల్ ఆయిల్స్ అవసరం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగు వ్యూహాత్మక ప్రాధాన్యతను సంతరించుకుందని మంత్రి తెలిపారు. ఇతర నూనెగింజల పంటలతో పోలిస్తే అధిక దిగుబడి ఇచ్చే ఈ పంట రైతులకు స్థిరమైన, దీర్ఘకాలిక ఆదాయ వనరుగా మారిందన్నారు. ఒకసారి తోటను ఏర్పాటు చేస్తే సుమారు 30 సంవత్సరాలపాటు దిగుబడి అందే ఈ పంట ద్వారా రైతులు ఎకరాకు సంవత్సరానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. ఆయిల్ పామ్ రైతులకు మార్కెటింగ్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని మంత్రి తెలిపారు. రైతులు పండించిన ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లు , ఆయిల్ పామ్ కంపెనీల ద్వారా నేరుగా కొనుగోలు చేయబడుతున్నాయని, దీంతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందన్నారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల ధర మెట్రిక్ టన్నుకు రూ.23,501గా ఉండటం రైతులకు మరింత ప్రయోజనకరంగా మారిందన్నారు. అయితే, గతంలో అమలులో ఉన్న విధంగా కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై 44 శాతం దిగుమతి సుంకాన్ని పునరుద్ధరిస్తే, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు మరింత మేలు జరుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. దిగుమతి సుంకం పెరగడం వల్ల దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి, ఆయిల్ పామ్ గెలల ధర మెట్రిక్ టన్నుకు రూ.25,000 వరకు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో రైతులకు మరింత అధిక ఆదాయం లభించడంతో పాటు, కొత్తగా ఎక్కువ మంది రైతులు కూడా ఆయిల్ పామ్ సాగు వైపు ఆకర్షితులయ్యే అవకాశం ఉందన్నారు. దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెరగడం, రైతుల ఆదాయం మెరుగుపడడం, దిగుమతులపై ఆధారపడటం తగ్గడం వంటి ప్రయోజనాలు కూడా కలుగుతాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వివరించారు. రైతులకు నాణ్యమైన మొక్కల సరఫరా, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థల ఏర్పాటుకు సబ్సిడీ, మొదటి నాలుగు సంవత్సరాలపాటు తోటల నిర్వహణకు ఆర్థిక సహాయం, అంతర పంటల సాగుకు ప్రోత్సాహకాలు, కోత పరికరాల కొనుగోలుకు ఎకరానికి రూ.51 వేల వరకు రాయితీ అందిస్తున్నామని తెలిపారు. అదనంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా పలు వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పారు. ఈ చర్యలన్నీ రైతుల పెట్టుబడి భారం తగ్గించి, ఆయిల్ పామ్ సాగుపై విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగుకు అవసరమైన ప్రాసెసింగ్ మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు, సిద్ధిపేట జిల్లాలో ఒకటి కలిపి మొత్తం మూడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని చెప్పారు. వీటి గంటకు ప్రాసెసింగ్ సామర్థ్య 150 మెట్రిక్ టన్నుల వరకు ఉందన్నారు. అదనంగా మరో ఏడు ప్రాసెసింగ్ మిల్లులు నిర్మాణ దశలో ఉన్నాయని, అవి పూర్తయిన తర్వాత రైతులకు మరింత సమీపంలోనే ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఆయిల్ పామ్ రంగం కేవలం రైతుల ఆదాయాన్నే పెంచడం కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. ప్రాసెసింగ్ మిల్లులు, రవాణా, కోత, నిల్వ, అనుబంధ కార్యకలాపాల ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు పరిశ్రమల అభివృద్ధికి కూడా ఈ రంగం దోహదపడుతోందన్నారు. పంటల వైవిధ్యీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాలని నిర్ణయించిందని మంత్రి వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మరో 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, దేశంలో వంటనూనెల స్వయం సమృద్ధి సాధించడం, గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయడం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, "తెలంగాణ రైతన్న కృషి, పట్టుదల, ప్రభుత్వ ప్రోత్సాహం కలిసి వచ్చిన ఫలితమే ఈ అగ్రస్థానం. దేశవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ నంబర్-1గా నిలవడం ప్రతి రైతుకు గర్వకారణం. రైతుల సంక్షేమం, ఆదాయ వృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అవసరమైన ప్రతి సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు.

## బీజేపీ నేత శ్రీనివాస్ రావు కుటుంబాన్ని పరామర్శించిన చెన్నమనేని వికాస్ రావు

**కోరుట్ల,(మనసులో మాట):** సీనియర్ బీజేపీ నాయకుడు రాచమడుగు శ్రీనివాస్ రావు మాతృమూర్తి ఇటీవల స్వర్గస్తులైన నేపథ్యంలో.. వారి కుటుంబ సభ్యులను వేములవాడ బీజేపీ నేత చెన్నమనేని వికాస్ రావు కోరుట్లలో పరామర్శించారు. శ్రీనివాస్ రావు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మాతృమూర్తి మరణం బాధాకరమని, ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలో బీజేపీ నాయకులు రాచమడుగు వెంకటేశ్వర్ రావు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, కథలాపూర్ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, గాంధారి శ్రీనివాస్, పిడుగు ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పెట్రో, డీజిల్ ధరలతో ఆటో డ్రైవర్ల బతుకులు బుగ్గిపాలు

**ఇంధన ధరలను వెంటనే తగ్గించాలంటూ ఆటో కార్మికుల నిరసన ప్రదర్శన**

**ఒకవైపు ఉచిత బస్సు ప్రయాణం.. మరోవైపు పెరిగిన ధరలతో ఆటో కార్మికులకు తీవ్ర నష్టం**

**సింగరేణి, ఆర్టీసీ తరహాలోనే ఆటోలకూ రాయితీపై డీజిల్ అందించాలి: బీఆర్‌టీయూ**

**మంచిర్యాల, (మనసులో మాట):** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని భారతీయ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్ పాషా డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన ధరలను విపరీతంగా పెంచడం వల్ల ఆటో డ్రైవర్ల బతుకులు అగమ్యగోచరంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ (IB) చౌరస్తాలో ఆటో కార్మికులతో కలిసి బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పుడు మళ్లీ డీజిల్ ధరల పెంపుతో వారి పరిస్థితి 'ములిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు' తయారైందని మండిపడ్డారు. సింగరేణి సంస్థకు, ఆర్టీసీ సంస్థకు ఏ విధంగానైతే రాయితీ (సబ్సిడీ)పై డీజిల్ ఇస్తున్నారో, అదే విధంగా ఆటో కార్మికులకు కూడా రాయితీపై ఇంధనాన్ని సరఫరా చేయాలని కోరారు. అవసరమైతే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమకు వచ్చే జీఎస్టీ (GST) వాటాను తగ్గించుకుని ఆటో కార్మికులకు ఈ రాయితీని కల్పించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం శ్రీనివాస్, అధికార ప్రతినిధి వేల్పుల శంకర్, తాండూరు మండల ఆటో కార్మికులు, యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**లబ్ధిదారులకు రూ. లక్ష ఆర్థిక సాయం అందజేసిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

**కుభీర్ మండల కేంద్రంలో 80 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

**పెండింగ్‌లో ఉన్న 160 దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ**

**నిర్మల్,(మనసులో మాట):** ఆడపడుచుల పెళ్లిళ్లకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ముధోల్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) పవార్ రామారావు పటేల్ సూచించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, వివిధ గ్రామాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఈ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న మరో 160 కల్యాణలక్ష్మి దరఖాస్తులకు త్వరలోనే అనుమతులు (క్లియరెన్స్) వచ్చేలా చొరవ తీసుకుంటానని లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ భీమేష్, స్థానిక సర్పంచ్ కందూరి సాయినాథ్, నాయకులు బోయిడి విఠల్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మారుతి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యం

**స్నిఫర్ డాగ్ 'విక్కి' సహాయంతో నారాయణపేటలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు**

**బస్టాండ్, పాన్ షాపులు, అనుమానాస్పద ప్రాంతాల్లో ఈగల్ ఫోర్స్ సోదాలు**

**మత్తు పదార్థాల సమాచారం ఉంటే 1908 నంబర్‌కు తెలపండి: టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు**



**నారాయణపేట (మనసులో మాట):** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈగల్ ఫోర్స్ టీంతో కలిసి, ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలం "విక్కి" సహాయంతో శుక్రవారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, రెస్టారెంట్లు, పలు అనుమానాస్పద ప్రదేశాల్లో పోలీసులు విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ వంటి అలవాట్లు సమాజాన్ని, కుటుంబాలను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా లేదా రవాణా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్, ఈగల్ ఫోర్స్ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో అగ్రి అధికారుల ఆకస్మిక సోదాలు



**ఎండపల్లి,(మనసులో మాట):** వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎండపల్లి, వెల్గటూర్ మండలాల్లోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సోదాల్లో స్టాక్ రిజిస్టర్లు, పీఓఎస్ యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ.. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినా, ప్రభుత్వ ధరల కంటే ఎక్కువకు ఎరువులు విక్రయించినా డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. రైతులు ప్రతి కొనుగోలుకు బిల్లులు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఏడీఏ రాజా నాయకుడు, ఏఓలు మహేష్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

**సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్**

**నిజామాబాద్, (మనసులో మాట):** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్ అర్బన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలను కేంద్ర ప్రభుత్వం విపరీతంగా పెంచిందని విమర్శించారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా దేశంలో ఇంధన ధరలు తగ్గించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.



ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కులను కాలరాసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరి కోయ్యలను కాల్చకండి. పర్యావరణాన్ని పాడు చేయకండి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.**

**నల్లగొండ,(మనసులో మాట):** రైతులు వరి పంట కోసిన తర్వాత పొలం పై ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని, అందువల్ల ఎవరు వరి కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న గిరక బావి గూడెంలో రైతులు వరి కొయ్యలను పొలంపైనే తగలబెడుతున్నారని తెలుసుకొని అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడారు. వరికోయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, అనంతరం దుక్కి దున్నినప్పటికీ గుల్లగా మారదని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వెళ్లే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని, వరి కొయ్యల వల్ల పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు పరికరాలు తగలబడే అవకాశం ఉందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి కోయ్యలను తగలబెట్ట వద్దన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో వరి కొయ్యలను తగలబెట్టడం వలన ప్రాణాపాయం సంభవించిన విషయాలను ఆయన గుర్తు చేశారు.



రైతులు వరికొయ్యలను తగలబెట్టకుండా ఉండేందుకుగాను వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ వరి కొయ్యలను పొలం పైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా, భూములు సారవంతం కోల్పోతాయని, అందువల్ల ఎవరు తగలబెట్టవద్దని చెప్పారు. ఎవరైనా ఇలా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాల సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు



చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, తదితరులు జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంట ఉన్నారు.

# కూకట్‌పల్లి పరిధిలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల నిర్మాణం

- నిరుపేదల గృహ నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు
- తొలిదశ ప్రయోగాత్మక ప్రాజెక్టు కింద 12 వేల ఫ్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు అనుమతి
- అల్పాదాయ వర్గాల ఫ్లాట్లకు ఐదు లక్షల రూపాయల ప్రభుత్వ రాయితీ

**హైదరాబాద్, (మనసులో మాట):** కూకట్‌పల్లి పరిధిలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. అల్పాదాయ వర్గాలు (ఎల్ఐజీ), మధ్య ఆదాయ వర్గాల (ఎంఐజీ) కోసం ఈ ఫ్లాట్లను నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా దిగువ, మధ్య తరగతి ప్రజల కోసం మొత్తం లక్ష ఫ్లాట్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. అందులో భాగంగా తొలిదశ ప్రయోగాత్మక (పైలట్) ప్రాజెక్టు కింద 12 వేల ఫ్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ సంస్థ (హౌసింగ్ బోర్డు)కు అనుమతులు మంజూరు చేశారు. ఎల్ఐజీ ఫ్లాట్లకు భూమి యూడీఎస్‌తో పాటు ఐదు లక్షల రూపాయల రాయితీ (సబ్సిడీ)ని కూడా ప్రభుత్వం అందించనుంది. హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ, మరియు

ప్రభుత్వ భూముల్లో ఈ ఫ్లాట్ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు

# పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కేంద్రంలో ఎరువుల విత్తనాల అమ్మకం కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ చంద్రశేఖర్
- జీలుగ, జనుము విత్తనాలపై 50 శాతం సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం





**నల్లగొండ(మనసులో మాట):** రాష్ట్ర ప్రభుత్వం రాయితీ (సబ్సిడీ)పై అందజేస్తున్న పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారాల స్తంభం (క్లాక్ టవర్) వద్ద ఉన్న నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల అమ్మకం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువులను సబ్సిడీపై అందజేస్తున్నదని తెలిపారు. దీనిలో భాగంగా జీలుగ విత్తనాలు కిలో ధర 163.50 రూపాయలు ఉండగా, ప్రభుత్వం కిలోకు 81.75 రూపాయల సబ్సిడీ ఇస్తుందని, రాయితీ పోను రైతు కిలోకు 81.75 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే 30 కిలోల జీలుగ విత్తనాల బ్యాగును రైతులు 2,452.50 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. జనుము విత్తనాలకు సంబంధించి కిలో ధర 155.60 రూపాయలు ఉండగా, ప్రభుత్వం కిలోకు 77.75 రూపాయల సబ్సిడీ ఇస్తుందని, తక్కిన 77.75 రూపాయలు రైతు చెల్లించి కొనాల్సి ఉంటుందని వివరించారు. కాగా, 40 కిలోల జనుము విత్తనాల బ్యాగును రైతులు 3,110 రూపాయలు చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల సాగు వల్ల భూమిలో సేంద్రియ కర్బన సాంద్రత పెరుగుతుందని, అలాగే నేల జీవశక్తి, సారవంతం రెట్టింపవుతాయని, తద్వారా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల రైతులు ఈ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ద్వారా జిల్లాకు 3,500 క్వింటాళ్ల జీలుగ, 500 క్వింటాళ్ల జనుము విత్తనాలు కేటాయింపు జరిగిందని, వీటిని జిల్లాలోని వివిధ మండల కేంద్రాలకు ఇప్పటికే పంపడం జరిగిందని ఆయన వివరించారు.

# నకిలీ జీవోలతో భూ ఒప్పందాలు.. ముఠా గుట్టురట్టు

- ఫోర్జరీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమికే ఎసరు; ముగ్గురు నిందితుల అరెస్ట్
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహా పలువురు పరారీ
- రూ. 4 కోట్ల చేతులు మారినట్లు గుర్తింపు: శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వెల్లడి

**మేడ్చల్,(మనసులో మాట):** నకిలీ (ఫేక్) జీవోలు, అక్రమ భూ ఒప్పందాల ద్వారా భారీ మోసానికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లను పోలీసులు అరెస్ట్ చేయగా.. వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహా మరికొందరు పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు.

### ప్రభుత్వ భూమిపై నకిలీ జీవోల వైరల్..

గండిపేట సర్వే నంబర్ 18లోని ప్రభుత్వ పోరంబోకు భూమిపై నిందితులు నకిలీ పత్రాలు సృష్టించారని దర్యాప్తులో తేలింది. ఆ భూమి తమదేనని నమ్మించేందుకు, ప్రభుత్వం ఆ భూమిని క్రమబద్ధీకరించిందంటూ ఐదు నకిలీ జీవోలను సృష్టించారు. అనంతరం ఈ నకిలీ జీవో కాపీలను వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో (సోషల్ మీడియా) వైరల్ చేశారు. ఎకరం రూ. 3.5 కోట్ల చొప్పున ఆ భూమిని విక్రయించేందుకు నిందితులు భారీ కుట్ర పన్నారు.

### రూ. 4 కోట్ల మేర లావాదేవీలు..

ఈ భూమి డీలింగ్‌కు సంబంధించి వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్‌తో ఒప్పందం కుదిరినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. బ్రహ్మనాయుడు నుంచి నిమ్మల కుటుంబానికి రెండు విడతలుగా బ్యాంక్ ఖాతాల ద్వారా డబ్బు బదిలీ అయినట్లు ఆధారాలు లభించాయి. ఒకసారి కోటి రూపాయలు, మరోసారి రూ. 25 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయగా, ఈ భూ లావాదేవీల్లో మొత్తంగా సుమారు నాలుగు కోట్ల రూపాయలు చేతులు మారినట్లు డీసీపీ స్పష్టం చేశారు.

### హైకోర్టు కొట్టేసినా ఆగని దందా..

కోర్టు ఆదేశాల ప్రకారం నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి బ్యాంక్ పాస్ పుస్తకాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోయినా ప్రభుత్వ భూమిపై హక్కులు ఉన్నట్లు నిందితులు డ్రామా ఆడారు. గతంలో ఈ భూమి తమదేనంటూ నిందితులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా, అక్టోబర్ 2025లోనే వాటిని న్యాయస్థానం కొట్టివేసిందని డీసీపీ గుర్తుచేశారు. అయినప్పటికీ నిందితులు అక్రమంగా భూమి అమ్మకానికి ప్రయత్నించారని చెప్పారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ఇలాంటి నకిలీ జీవోలు, ఫోర్జరీ పత్రాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ హెచ్చరించారు. భూములు కొనుగోలు చేసే ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులను (ధరణి, ఈసీ తదితరాలను) తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు.

# చర్లపల్లి జైలుకు బండి భగీరథ్ తరలింపు

**ముగిసిన 3 రోజుల పోలీసు కస్టడీ; మల్కాజ్‌గిరి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు**

**పోక్సో (POCSO) కేసులో నిందితుడిపై కొనసాగుతున్న సుదీర్ఘ విచారణ**

**ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ చాటింగ్‌ల ఆధారంగా కీలక ఆధారాలు సేకరించిన వైనం**



**మనసులో మాట, మే 29, హైదరాబాద్:** పోక్సో (POCSO) కేసులో నిందితుడైన బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. మూడు రోజుల కస్టడీ గడువు ముగియడంతో పోలీసులు ఆయనను క్షుణ్ణంగా విచారించిన అనంతరం మల్కాజ్‌గిరి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు అనంతరం నిందితుడిని భారీ భద్రత మధ్య చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసులో ప్రధానంగా బాధితురాలితో నిందితుడు జరిపిన ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, స్నాప్‌చాట్ చాటింగ్‌లకు సంబంధించిన పలు కీలక సాంకేతిక ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. ఆ డిజిటల్ ఆధారాలను ముందే పెట్టుకుని, వాటి ఆధారంగానే మూడు రోజుల పాటు భగీరథ్‌ను పోలీసులు సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ విచారణలో కేసునకు సంబంధించి మరికొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

# తెలంగాణ బిడ్డలను ముట్టుకుంటే ఖబర్దార్

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**మనసులో మాట, మే 29, హైదరాబాద్:** ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావును విమర్శించే స్థాయి గానీ, అర్హత గానీ ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు లేవని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డలను ముట్టుకోవాలని ఆంధ్ర నుండి ఎవరైనా ప్రయత్నిస్తే ఇక్కడ తీవ్ర పరిణామాలు ఉంటాయని, మళ్లీ 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మొదలవుతుందని ఆయన హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్‌పై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. "దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేయండి.. అప్పుడు ఆయన ఇంటి ముందు అడ్డుగా నేనే నిలబడతాను" అని పవన్ కల్యాణ్‌కు అనిరుధ్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. పవన్ కల్యాణ్‌ను ఒక 'ప్యాకేజీ స్టార్'గా అభివర్ణించిన ఆయన.. భవిష్యత్తులో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గనుక ఎక్కువ ప్యాకేజీ ఇస్తే, ఆయనకు కూడా సపోర్ట్ చేయడానికి పవన్ వెనకాడరని ఎద్దేవా చేశారు. ఏపీ రాజకీయ నాయకుల తీరుపై మండిపడుతూ.. "మీరంతా ఉండేది, ఆస్తులు సంపాదించుకునేది హైదరాబాద్‌లోనే కదా.. మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, రాజకీయ స్వార్థం కోసం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదని పవన్ కల్యాణ్‌కు అనిరుధ్ రెడ్డి హితవు పలికారు.

# ఉచిత కరెంట్ ఎగవేసేందుకే కాంగ్రెస్ పన్నాగం

- **ఈఆర్సీ (ERC) ముందు కోదండరెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం**
- **రైతులను మళ్లీ చీకట్లలోకి నెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ధ్వజం**
- **రుణమాఫీ, రైతుబంధు బంద్ చేసి.. ఇప్పుడు 24 గంటల కరెంట్‌ను ఖతం పట్టిస్తున్నారు**

**హైదరాబాద్,(మనసులో మాట):** రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదని, 3 గంటల కరెంట్ చాలంటూ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడి వ్యాఖ్యలు రేవంత్ రెడ్డి ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని ఆయన పేర్కొన్నారు. గతంలో అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పొలం అంటే ఏమిటో.. బోర్ ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబగళ్లు ఎలా కష్టపడతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడుతారని హరీశ్ రావు ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కానీ కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీని అటకెక్కించారని, రైతుబంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారని, పంట కొనుగోళ్లు సరిగ్గా చేయక రైతుల ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కమ్ వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ రెడ్డి కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హరీశ్ రావు హెచ్చరించారు.

# తెలంగాణలో అంచనాలను మించి ధాన్యం ఉత్పత్తి

- **చివరి గింజ వరకు మద్దతు ధరకే కొంటాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**
- **తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నాం; రూ. 16,479 కోట్లు ఖర్చు**
- **మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి మీడియా సమావేశం**

**హైదరాబాద్,(మనసులో మాట):** దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన కొనుగోళ్ల కంటే ఇప్పుడు తాము ఎక్కువ మొత్తంలో కొంటున్నామని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూనే.. వారు చెప్పిన దానికంటే అదనంగా ధాన్యాన్ని సేకరిస్తున్నామని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 16,479 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో పండిన ప్రతి చివరి గింజను కొనుగోలు చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. ధాన్య సేకరణ కోసం క్షేత్రస్థాయిలో 13 వేల వాహనాలను అందుబాటులో ఉంచామని, 2 లక్షల మంది సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారని వివరించారు. కొనుగోలు కేంద్రాలకు ఇప్పటికే 20.86 కోట్ల గన్నీ బ్యాగులను పంపామని, ఇప్పటివరకు సేకరించిన ధాన్యానికి గాను రూ. 11,050 కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని స్పష్టం చేశారు.



### కేంద్రంపై ఒత్తిడి తేవాలి..

ధాన్య సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడాల్సి వచ్చిందని, బెంగాల్ ఎన్నికల కారణంగా కార్మికులు స్వస్థలాలకు వెళ్లడంతో కొద్దిగా ఆలస్యమైందని మంత్రి పేర్కొన్నారు. మద్దతు ధర కోసం తమ ప్రభుత్వం రూ. 49 వేల కోట్లు వెచ్చిస్తుంటే.. గత ప్రభుత్వం కేవలం రూ. 10 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా 143 లక్షల టన్నుల ధాన్యం పండగా.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా కొనుగోలు చేశామన్నారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. యాసంగిలో తాము 73 లక్షల టన్నులు కొనుగోలు చేస్తే.. కేంద్రం మాత్రం కేవలం 5 లక్షల టన్నులే కొంటామని అనడం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రాన్ని కోరినా పట్టించుకోవడం లేదని, బీజేపీ నాయకులు ఇక్కడ ధర్నాలు చేయడం కాకుండా ఢిల్లీకి వెళ్లి వడ్లు కొనేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

### తడిసిన ధాన్యం కూడా కొన్నాం..

ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా ఉందన్న మంత్రి, పొరుగు రాష్ట్రమైన ఏపీలో కేవలం 24 లక్షల టన్నులే కొన్నారని పోల్చి చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో రూ. 36 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామన్నారు. హమాలీల కొరత ఉన్నప్పటికీ కొనుగోళ్లకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన 10,214 టన్నుల ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

# జడ్చర్లలో రూ.80 లక్షల పాఠశాల భవనానికి భూమిపూజ

**మనసులో మాట, మే 29, మహబూబ్‌నగర్:** జడ్చర్ల మండలం బాదేపల్లి పాతబజార్ హరిజనవాడలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులు రూ. 80 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల నూతన భవనానికి కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యా రంగానికి కార్పొరేట్ సంస్థల సహకారం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ బడుల అభివృద్ధికి అరబిందో సంస్థ రూ. 4 కోట్లు ఇస్తోందని, త్వరలోనే గుడిగానిపల్లిలో రూ. 1.20 కోట్లతో మరో భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, ఎంఈఓ మంజులాదేవి, ఫార్మా ప్రతినిధులు జనార్ధన్ రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



# ఎక్కడా ధాన్యపు కొనుగోళ్లు లేవు


### 80 శాతం కుప్పలే కనిపిస్తున్నాయి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**మనసులో మాట, మే 29, హైదరాబాద్:** రాష్ట్రంలో రైతాంగం పడుతున్న బాధలను స్వయంగా తెలుసుకునేందుకే తాము 'రైతు కోసం – బీజేపీ భరోసా' యాత్ర చేపట్టామని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నాలుగు రోజుల పాటు అనేక జిల్లాల్లో పర్యటించి రైతుల ఆర్తనాదాలు విన్నామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో తాము చూస్తే 80 శాతం ధాన్యం కుప్పలు కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోయి కనిపించాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్‌పై అస్సలు కంట్రోల్ లేదని, రాష్ట్రంలో దోపిడీ రాజ్యం నడుస్తోందని ఏలేటి విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయలేకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి, వాటిని ధాన్యం సేకరణకు ఎందుకు వాడలేదని నిలదీశారు. ఐలాస్ గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి లేదని, లారీ, హమాలీ ఖర్చులు కూడా రైతులే చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. "చివరి గింజ వరకు కొనే బాధ్యత నాది" అని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కొనుగోళ్లు చేయకపోతే సీఎం పీఠం దిగిపోవాలన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు తాను ఎందుకు కొనుగోళ్లు చేయడం లేదని ప్రశ్నించారు. ఓటు బ్యాంక్ కోసమే రైతులను వాడుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన యూరియాను కూడా సక్రమంగా ఇవ్వకుండా యాప్ల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వయసు మీరి బుద్ధి మందగించిందని, అందుకే బీజేపీని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెట్రోల్, డీజిల్‌పై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజిల్‌పై 30 శాతం వ్యాట్ ఎందుకు తగ్గించడం లేదని సీఎంను డిమాండ్ చేశారు. రైతులు వడదెబ్బతో చనిపోతుంటే మంత్రులు పరామర్శించలేదని, ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేదని దుయ్యబట్టారు. సన్‌ఫ్లవర్, శనగలు కొంటున్నామని మంత్రి తుమ్మల చెబుతున్నారని, వాటి కొనుగోలు కౌంటర్లు ఎక్కడ పెట్టారో చూపించాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా డ్రైవర్ మృతి

### యాలాల ఎస్సై విఠల్ రెడ్డి

**యాలాల (మనసులో మాట):** పగడాల నుండి రాష్ట్రం వెళ్లే దారి మధ్యలో మలుపు మార్గంలో ఒక ట్రాక్టర్ TS 34TA6528, ట్రాలీ ఔూ 27ఎ5281 గల ట్రాక్టర్ను అందులో శిల్ప రాయి తీసుకొని వెళుతున్న క్రమంలో మలుపు వద్ద అదుపుతప్పి కింద పడగా ట్రాక్టర్ ను నడిపిస్తున్నటువంటి బోడ శ్రీశాంత్ తండ్రి బాలప్ప వయసు 19 సంవత్సరాలు,ఇంద్రనగర్ తాండూర్ కు చెందిన వ్యక్తి మృతి చెందినట్లు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.



# పంటల వైవిధ్యీకరణతోనే రైతులకు భరోసా

- వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ అవసరం: వీసీ డా. దండా రాజిరెడ్డి
- రసాయనాల వాడకం తగ్గించి జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలకు సూచన
- పాలీహౌస్‌ల పునరుద్ధరణ, కోతుల సమస్యకు శాస్త్రీయ పరిష్కారాలు కావాలి: కె. వీరభద్రరావు





**గజ్వేల్,(మనసులో మాట):** రాష్ట్రంలో వ్యవసాయ రంగం స్థిరంగా అభివృద్ధి చెందాలంటే సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పంటల వైవిధ్యీకరణ (పంటల మార్పిడి) వైపు అడుగులు వేయడం అత్యంత అవసరమని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. దండా రాజిరెడ్డి అన్నారు. రైతులే ఈ మార్పుకు ముందుండి మార్గదర్శకులుగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ములుగులోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి డా. రాజిరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో సంభవించే తీవ్ర వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని, వాటిని తట్టుకునేలా ముందస్తు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల నేల కాలుష్యం పెరిగి మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూలం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు, విస్తరణ నిపుణులు క్షేత్రస్థాయికి వెళ్లి రసాయనాల వాడకాన్ని తగ్గించేలా సమగ్ర పోషక నిర్వహణ, సమగ్ర పురుగు నివారణ పద్ధతులను రైతులకు విస్తృతంగా చేరవేయాలని సూచించారు. ప్రస్తుత జీవ నియంత్రణ పద్ధతులు ఎంతో కీలకమన్నారు. రైతుల్లో అవగాహన పెంచేందుకు విస్తరణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని, ప్రతి 50 కిలోమీటర్ల పరిధిలో ఒక వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు.

### ఉపగ్రహ సాంకేతికతతో చీడపీడల గుర్తింపు..

సమావేశానికి ముఖ్యంగా హాజరైన అగ్రి హార్టీ సొసైటీ కార్యదర్శి కె. వీరభద్రరావు మాట్లాడుతూ.. రైతు సంతృప్తే ప్రభుత్వాలు, విద్యా సంస్థల ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఉద్యాన పంటల అభివృద్ధికి అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రాష్ట్రంలో పాడైపోయిన రక్షిత సాగు గృహాల (పాలీహౌస్‌ల) పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో ఉద్యాన పంటల సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్న ఆయన.. బాలానగర్ సీతాఫలం, ద్రాక్ష వంటి పంటలు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురాగలవని అన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణ కోసం సేంద్రియ పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం రైతులకు పెద్ద సమస్యగా మారిన కోతుల బెడదపై శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. ఉపగ్రహ ఆధారిత (శాటిలైట్) సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పంటల పరిస్థితిని, చీడపీడల ఉధృతిని ముందుగానే గుర్తించి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిశోధనా సంస్థలతో సమన్వయం పెంచుకుని కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖ అధికారులు, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పలు అంశాలపై సాంకేతిక సమావేశాలు నిర్వహించారు.

# ఎక్కడా ధాన్యపు కొనుగోళ్లు లేవు

- 80 శాతం కుప్పలే కనిపిస్తున్నాయి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్,(మనసులో మాట):** రాష్ట్రంలో రైతాంగం పడుతున్న బాధలను స్వయంగా తెలుసుకునేందుకే తాము రైతు కోసం – బీజేపీ భరోసా' యాత్ర చేపట్టామని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నాలుగు రోజుల పాటు అనేక జిల్లాల్లో పర్యటించి రైతుల ఆర్తనాదాలు విన్నామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో తాము చూస్తే 80 శాతం ధాన్యం కుప్పలు కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోయి కనిపించాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్‌పై అస్సలు కంట్రోల్ లేదని, రాష్ట్రంలో దోపిడీ రాజ్యం నడుస్తోందని ఏలేటి విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయలేకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి, వాటిని ధాన్యం సేకరణకు ఎందుకు వాడలేదని నిలదీశారు. బలాస్ గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి లేదని, లారీ, హమాలీ ఖర్చులు కూడా రైతులే చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. "చివరి గింజ వరకు కొనే బాధ్యత నాది" అని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కొనుగోళ్లు చేయకపోతే సీఎం పీఠం దిగిపోవాలన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు తాను ఎందుకు కొనుగోళ్లు చేయడం లేదని ప్రశ్నించారు. ఓటు బ్యాంక్ కోసమే రైతులను వాడుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన యూరియాను కూడా సక్రమంగా ఇవ్వకుండా యాప్ల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వయసు మీరి బుద్ధి మందగించిందని, అందుకే బీజేపీని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెట్రోల్, డీజిల్‌పై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజిల్‌పై 30 శాతం వ్యాట్ ఎందుకు తగ్గించడం లేదని సీఎంను డిమాండ్ చేశారు. రైతులు వడదెబ్బతో చనిపోతుంటే మంత్రులు పరామర్శించలేదని, ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేదని దుయ్యబట్టారు. సన్‌ఫ్లవర్, శనగలు కొంటున్నామని మంత్రి తుమ్మల చెబుతున్నారని, వాటి కొనుగోలు కొంటర్లు ఎక్కడ పెట్టారో చూపించాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.




# ఎర్రగుట్ట నుండి అక్రమంగా ఎర్రమట్టి తరలింపు

- పట్టించుకోని ధన్వాడ మండల అధికారులు; జిల్లా స్థాయి విచారణ చేపట్టాలి
- రోజుకు 4 ట్రిప్పుల అనుమతితో 30 ట్రిప్పుల మట్టి కొల్లగొడుతున్న వైనం
- కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళన: రైతు గౌని శ్రీనివాసులు హెచ్చరిక



**ధన్వాడ,నారాయణపేట(మనసులోమాట):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల పరిధిలోని యమ్నోనిపల్లి ఎర్రగుట్ట నుండి అక్రమంగా ఎర్రమట్టిని మక్తల్ మండలంలోని గుడిగండ్ల గ్రామానికి తరలిస్తున్నారని యమ్నోనిపల్లి గ్రామ రైతు గౌని శ్రీనివాసులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వానికి సంబంధించిన గుట్టలను జేసీబీ యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు.

### అధికారుల అండతోనే అక్రమ దందా..

ప్రతిరోజు రెండు, మూడు ట్రిప్పుల మట్టి తోలుకునేందుకు మాత్రమే కాగితాలపై అనుమతులు తీసుకుని, క్షేత్రస్థాయిలో మాత్రం రోజుకు 20 నుండి 30 ట్రిప్పుల వరకు ఎర్రమట్టిని గుట్టల నుండి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని శ్రీనివాసులు ఆరోపించారు. ఇట్టి విషయంపై ధన్వాడ మండల తహసీల్దార్ (ఎమ్మార్వో)ను వివరణ అడగగా.. తాము కేవలం నాలుగు ట్రిప్పులకు మాత్రమే పర్మిషన్ ఇచ్చామని చెప్పడం జరిగిందన్నారు. కానీ, శుక్రవారం ఉదయం 8 గంటల నుండి ప్రారంభమైన మట్టి రవాణా.. సాయంత్రం 5:25 గంటలు అవుతున్నా రెండు టిప్పర్ల ద్వారా జోరుగా సాగుతూనే ఉందని ఆయన సాక్ష్యాధారాలతో నిలదీశారు.

### కలెక్టర్ స్పందించకుంటే స్టేజీ వద్ద ఆందోళన

మండల అధికారుల అండదండలతోనే ఈ ఎర్రమట్టి దందా యథేచ్ఛగా సాగుతోందని, అందువల్ల నారాయణపేట జిల్లా అధికారులు స్పందించి దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని ఈ అక్రమ రవాణాపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోని పక్షంలో, యమ్నోనిపల్లి స్టేజీ వద్ద చుట్టుపక్కల గ్రామాల రైతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని గౌని శ్రీనివాసులు హెచ్చరించారు.



# మహిళా సంఘాలకు రూ. 3.21 కోట్ల భారీ రుణాల మంజూరు

**ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా యాలాలలో ఘనంగా 'రుణ మేళా'**

**21 స్వయం సహాయక సంఘాలకు (ాన+) ఆర్థిక చేయూత**

**మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ప్రజాప్రతినిధులు**



**యాలాల,(మనసులో మాట):** వికారాబాద్ జిల్లా యాలాల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - 99 రోజుల ప్రణాళిక'లో భాగంగా స్వయం సహాయక సంఘాలకు (SHG) రుణ మేళా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ రుణ మేళా కింద మండలంలోని వివిధ బ్యాంకులకు అనుసంధానంగా ఉన్న 21 మహిళా సంఘాలకు కలిపి మొత్తం రూ. 3,21,50,000/- (మూడు కోట్ల ఇరవై ఒక్క లక్షల యాభై వేలు) రుణాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ సి. హెచ్. శివయ్య, వికారాబాద్ జిల్లా మాజీ కో-ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక చేయూతను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపార ఉపాధి రంగాలలో రాణించాలని సూచించారు. బ్యాంకు నిబంధనల ప్రకారం రుణాలను సకాలంలో చెల్లించి మరిన్ని పెద్ద రుణాలు పొందేందుకు అర్హత సాధించాలని కోరారు. ఈ రుణ మేళా ఉత్సవంలో ఉపసర్పంచ్ మల్కిరెడ్డి శోభారాజు రెడ్డి, బ్యాంక్ అధికారి కృష్ణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వనమాల (విశ్వనాథ్‌పూర్), కార్యదర్శి కమలమ్మ (చిరుబషీర్మియా తండా), కోశాధికారి నవనీత (ముదాయిపేట), సీసీ వెంకటయ్య, రాజేశ్వరి, అనసూజ, సి. హెచ్. భీమమ్మ, భీమమ్మ, శ్రీశైలం, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు మరియు సంబంధిత శాఖల అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ఎమ్మెల్సీ దండే విఠల్ స్వాగతం

**మనసులో మాట, ఆసిఫాబాద్:** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక స్వాగతం పలికారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# రాజకీయ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు

- ఈడీ దాడులతో సీపీఎం నాయకత్వాన్ని బలహీనపరచలేరు: జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్
- కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌పై కక్షసాధింపు చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం
- వికారాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఎం శ్రేణుల నిరసన; పాల్గొన్న ముఖ్య నాయకులు



**వికారాబాద్,(మనసులో మాట):** కేంద్ర ప్రభుత్వ రాజకీయ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ సంస్థలను అడ్డుపెట్టుకొని సీపీఎం నాయకత్వాన్ని ఎవరూ బలహీనపరచలేరని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్ స్పష్టం చేశారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) జరిపిన దాడులకు వ్యతిరేకంగా శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. మహిపాల్ మాట్లాడుతూ.. కేరళలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ, కాంగ్రెస్ కలయికతో మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై రాజ్యాంగబద్ధ సంస్థలను అడ్డం పెట్టుకొని దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. కేరళకు 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ఉండి, నీతివంతమైన, ఆదర్శవంతమైన పాలన అందించిన వ్యక్తిని ఉద్దేశపూర్వకంగా అవమానపరచడానికే ఆయనతో పాటు కుటుంబ సభ్యులపై ఏకకాలంలో ఈడీ దాడులు చేయించారని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈడీ చెబుతున్న కేసులో మాజీ సీఎం పినరయి విజయన్ గారి ప్రస్తావన ఎక్కడా లేకపోయినప్పటికీ, కేవలం రాజకీయ ప్రతీకారంతోనే దాడులు చేస్తున్నారని విమర్శించారు.

**విపక్షాలపై కక్షసాధింపు..**

లక్షల కోట్ల రూపాయల కుంభకోణం చేసిన పశ్చిమ బెంగాల్ నేత సువేందు అధికారిపై ఎలాంటి చర్యలు లేవని, అవినీతిపరులు బీజేపీలో చేరగానే పునీతులు అవుతున్నారని మహిపాల్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న వారిని మాత్రమే దొంగలుగా చిత్రకరిస్తున్నారని ధ్వజమెత్తారు. తమ రాజకీయ ప్రత్యర్థులైన అరవింద్ కేజ్రీవాల్, శిబు సొరేన్, మనీష్ సిసోడియా వంటి వారిని ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని విమర్శించారు. సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే తమకు అభ్యంతరం లేదని, కానీ ఇలా విచారణ సంస్థలను దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. పినరయి విజయన్ కుమార్తెకు సంబంధించిన కంపెనీ వ్యవహారంలో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని గతంలో కోర్టులు స్పష్టం చేసినా, ఈ దాడులు చేయించడం వెనుక బీజేపీ, కాంగ్రెస్ కుట్ర దాగి ఉందన్నారు. అక్రమ కేసుల ద్వారా సీపీఎంను ఆపలేరని, ప్రజా ఉద్యమాల ద్వారా లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేసి మరింత బలోపేతం అవుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వికారాబాద్ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సతీష్, జిల్లా నాయకులు గోపాల్ రెడ్డి, లక్ష్మయ్య, రమేష్ కుమార్, బాలరాజు, గోపాల్, చందు, రత్నం, కిషన్ నాయక్, రాజు, వెంకటయ్య, అయూబ్ ఖాన్, దస్తగిరి, శ్రీనివాస్, డేవిడ్, వసంత్, రాఘవేందర్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- రైతులకు ఇబ్బంది లేకుండా వారంలో ప్రక్రియ పూర్తి చేయాలి: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు; రోజుకు 8 వేల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం: కలెక్టర్ రాహుల్ శర్మ
- ఐడీఓసీ కార్యాలయంలో అధికారులు, మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లతో ముమ్మర సమీక్ష



**భూపాలపల్లి,(మనసులో మాట):** అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సరిహద్దు పరిధిలోని ఐడీఓసీ (IDOC) కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌లతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, పీఏసీఎస్ సీఈఓలు, ఏపీఎంలతో ఆయన ముమ్మర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్ మక్కల (మొక్కజొన్న) కొనుగోళ్లలో భూపాలపల్లి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, అదే స్ఫూర్తితో ధాన్యం కొనుగోళ్లను కూడా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆకస్మిక వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రాల్లో రైతులకు తప్పనిసరిగా తార్పాలిన్లు, ట్రక్ షీట్లు అందుబాటులో ఉంచాలని, తూకం (కాంటా) పూర్తయిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని ఆదేశించారు. సాంకేతిక ఇబ్బందులు ఉన్నందున ఐరిస్ విధానానికి బదులుగా ఓటీపీ (ా్రూ) ద్వారా కొనుగోళ్లు నిర్వహించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, మరో వారంలోగా కొనుగోలు ప్రక్రియ మొత్తాన్ని ముగించాలని స్పష్టం చేశారు.

**లారీల కొరత ఉంటే ట్రాక్టర్లను వాడండి: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం జరిగిన వెంటనే రైతులకు ట్రక్ షీట్లు ఇవ్వాలని, ఇందులో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా రోజుకు కనీసం 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. మిల్లులకు తరలించేందుకు లారీల కొరత ఉంటే, స్థానిక ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేరవేయాలన్నారు. ధాన్యం బస్తాలను ఎత్తైన ప్రాంతాల్లో నిల్వ ఉంచి వర్షపు నీరు చేరకుండా రక్షించాలని సూచించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌తో పాటు పౌరసరఫరాల శాఖ, రవాణా, సహకార, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, పీఏసీఎస్ సీఈఓలు, ఏపీఎంలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# త్రివేణి సంగమంలో భక్తులను అలరిస్తున్న ప్రత్యేక ఏర్పాట్లు





- సరస్వతి అంత్య పుష్కరాలకు పోటెత్తిన జనప్రవాహం; ఆధ్యాత్మిక శోభతో పులకించిన కాళేశ్వరం
- విద్యుత్ వెలుగులు, కళాత్మక నిర్మాణాలతో కనులపండువగా మారిన పుష్కర ఘాట్లు
- భక్తులకు ఇబ్బంది లేకుండా కట్టుదిట్టమైన భద్రత, తాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాటు

**కాళేశ్వరం,(మనసులో మాట):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ నదుల పవిత్ర త్రివేణి సంగమం వద్ద నిర్వహిస్తున్న సరస్వతి అంత్య పుష్కరాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ అంత్య పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, ఆలయ కమిటీ సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లు దేశం నలుమూలల నుండి వస్తున్న భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పవిత్ర స్నానాల ఆచరణ కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో విస్తృతమైన మౌలిక వసతులను కల్పించారు.

### రంగురంగుల విద్యుత్ వెలుగుల్లో కనులపండువ..

పుష్కరాల నేపథ్యంలో త్రివేణి సంగమ తీరంతో పాటు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో ఈ ప్రాంతమంతా అద్భుతమైన వాతావరణం సంతరించుకుంది. ఘాట్ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్టింగ్స్, తోరణాలు, కళాత్మక నిర్మాణాలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో విద్యుత్ వెలుగుల జిలుగులతో ఈ పుణ్యక్షేత్రం కనులపండువగా మారుతోంది. దీనికి తోడు పున్నమి చంద్రుడి వెలుగులు తోడవడంతో త్రివేణి సంగమం మరింత శోభాయమానంగా కనిపిస్తూ, భక్తులకు మైమరపించే ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తోంది. భక్తులు పవిత్ర నదీ స్నానాలు ఆచరించి, అనంతరం స్వామివారిని దర్శించుకుంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు.

### కట్టుదిట్టమైన భద్రత.. విస్తృత వసతులు

భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండడంతో పోలీసులు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఘాట్ల వద్ద నిరంతర నిఘా ఉంచారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత తాగునీటి



సరఫరా, ప్రత్యేక వైద్య శిబిరాలు, నిరంతర పారిశుద్ధ్య సదుపాయాలు, మహిళల కొరకు బట్టలు మార్చుకునే గదులను ఏర్పాటు చేశారు. భక్తులకు దిశా నిర్దేశం చేసేందుకుగాను ఘాట్లలో ప్రత్యేక మార్గదర్శక బోర్డులను అందుబాటులో ఉంచారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల పార్కింగ్ స్థలాలను క్రమబద్ధీకరించడంతో పాటు, ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక రవాణా సదుపాయాలను కూడా కల్పించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు అధికారులు, పోలీసులు జారీ చేసే సూచనలను పాటిస్తూ, క్రమశిక్షణతో వ్యవహరించి ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ సరస్వతి అంత్య పుష్కరాలు భక్తులకు అటు ఆధ్యాత్మిక విశిష్టతను, ఇటు సాంస్కృతిక అనుభూతులను సమాంతరంగా అందిస్తున్నాయి.

# 12వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె

- ఒంటికాలిపై నిలబడి వినూత్న నిరసన!
- కొడంగల్‌లో మిన్నంటిన నినాదాలు; చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని నాయకుల హెచ్చరిక
- పెద్ద ఎత్తున పాల్గొన్న వీఓఏలు, ఐకేపీ నియోజకవర్గ స్థాయి ప్రతినిధులు

**కొడంగల్,(మనసులో మాట):** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు (గ్రామ సంఘ సహాయకులు) చేపట్టిన సమ్మె శుక్రవారంతో 12వ రోజుకు చేరింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న ఈ సమ్మెలో భాగంగా.. ఈరోజు వీఓఏలు అందరూ ఒంటికాలిపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వీఓఏల సంఘం నాయకులు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కాలయాపన చేయకుండా వీఓఏ ప్రతినిధులను ప్రభుత్వం చర్చలకు పిలవాలని, అర్హత గల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరారు. "ప్రభుత్వం చర్చలకు రావాలి – మా సమస్యలు పరిష్కరించాలి" అంటూ వీఓఏలు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### దిగిరాకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం..

తమ సమస్యలపై ప్రభుత్వం ఇలాగే మొండివైఖరి అవలంబిస్తూ, నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే ప్రగతి భవన్ లేదా కలెక్టరేట్ ముట్టడికి కూడా వెనకాడబోమని సమ్మె నాయకులు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తమకు



న్యాయం చేయాలని వారు వేడుకున్నారు. ఈ వినూత్న నిరసన కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు అంజిలప్ప, పెంటప్ప, వెంకట్ రెడ్డి, మొగులప్ప, సుజాత, మంజుల, సువర్ణ, సరోజ, గణేష్, రవి, కవిత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ వర్క్‌షాప్‌లో హైడ్రాలిక్ వెహికల్ లిఫ్టర్ ప్రారంభం ఎస్పీ

**హేమచంద్రపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్క్‌షాప్‌లో నూతన పరికరం ఏర్పాటు**

**పోలీసు వాహనాల మరమ్మతులు ఇకపై మరింత సులభతరం.. సమయం, ఖర్చు ఆదా**

**- జిల్లావ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది సమక్షంలో ఘనంగా ప్రారంభం**



**కొత్తగూడెం(మనసులో మాట):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (మీ) వర్క్‌షాప్ నందు అధునాతనంగా ఏర్పాటు చేసిన 'టూ పోస్ట్ హైడ్రాలిక్ వెహికల్ లిఫ్టర్'ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ శుక్రవారం రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ అత్యాధునిక హైడ్రాలిక్ పరికరాన్ని ఉపయోగించి నాలుగు చక్రాల వాహనాలు, కార్ల యొక్క కింది భాగంలో చేయవలసిన ఇంజన్ వర్క్, గేర్ బాక్స్ రిపేర్లను అత్యంత సులభంగా, సురక్షితంగా చేయవచ్చు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు వాహనాలు నిరంతరం విధుల్లో తిరగడం వల్ల వాటికి తరచూ చిన్నచిన్న మరమ్మతులు వస్తుంటాయని పేర్కొన్నారు. అయితే, బయటి మెకానికల్ వర్క్‌షాపుల వద్దకు వాహనాలను తీసుకెళ్లడం వల్ల ఎక్కువ సమయం వెచ్చించవలసిన పరిస్థితి ఏర్పడుతోందని, దానికి ప్రత్యామ్నాయంగానే మన హెడ్ క్వార్టర్స్ వర్క్‌షాప్‌లోనే ఈ సరికొత్త హైడ్రాలిక్ వెహికల్ లిఫ్టర్‌ను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ఈ నూతన పరికరం వల్ల పోలీసు వాహనాల రిపేర్ పనులను చాలా వేగవంతంగా పూర్తి చేయడమే కాకుండా, ప్రభుత్వానికి నిర్వహణ ఖర్చులను కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ అధునాతన పరికర ప్రారంభోత్సవ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐ) ఓ. సుధాకర్ రావు, నరసింహారావు, లాల్ బాబు, కృష్ణ మరియు పోలీస్ వెహికల్ మెకానిక్‌లు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎమ్మెల్యేలు

**ఆసిఫాబాద్,(మనసులో మాట):** జూన్ 1న రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. శుక్రవారం ఆమె ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, వెడ్మ బొజ్జు, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌లతో కలిసి సభా స్థలిని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. హెలిప్యాడ్, వేదిక, పార్కింగ్, బారికేడింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, నిరంతర విద్యుత్, పారిశుద్ధ్య లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# అపరిశుభ్రంగా నిర్వహిస్తున్న రెస్టారెంట్ తాత్కాలిక మూసివేత

**ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా అధికారి వి. అంకిత్ రెడ్డి హెచ్చరిక**

**వంటగదిలో పేరుకుపోయిన మురికి, గ్లవ్స్ లేకుండా నిర్లక్ష్యంగా ఆహార తయారీ**

**మార్కెట్ ప్రాంతంలోని కిరాణా దుకాణాల్లోనూ సోదాలు; ల్యాబ్ పరీక్షల కోసం నమూనాల సేకరణ**

**పెద్దపల్లి,(మనసులో మాట):** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో గల 'శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ & మెస్'ను ఫుడ్ సేఫ్టీ (ఆహార భద్రత) నిబంధనల ఉల్లంఘనల కారణంగా తాత్కాలికంగా మూసివేసినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి. అంకిత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానికుల నుండి అందిన పక్కా ఫిర్యాదుల మేరకు సదరు హోటల్‌పై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో రెస్టారెంట్ వంటగది అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఉన్నట్లు అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించారు. గత ఏప్రిల్ నెలలోనే ఈ హోటల్‌ను ఒకసారి తనిఖీ చేసి, లోపాలను సరిచేసుకోవాలని యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినప్పటికీ.. ఎలాంటి మార్పులు చేసుకోకుండా నిర్లక్ష్యంగా నడుపుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**వంటగదిలో దారుణమైన లోపాలు..**

శుక్రవారం జరిపిన తనిఖీల్లో వంటగదిలో కనీస గాలి ప్రసరణ (వెంటిలేషన్) లేకపోవడం, వంట చేసే ప్రదేశమంతా తీవ్ర అపరిశుభ్రంగా ఉండటం, గోడలు, పైకప్పు మరియు ఎగ్జాస్ట్ ఫ్యాన్ల ప్రాంతాల్లో జిడ్డు, నూనె మురికి దట్టంగా పేరుకుపోవడాన్ని అధికారులు గమనించారు. అలాగే ఆరోగ్యానికి హాని కలిగించే పగిలిన ప్లాస్టిక్ డబ్బాల్లో ఆహార పదార్థాలను నిల్వ ఉంచడం, డ్రైనేజ్ వ్యవస్థ దెబ్బతిని ఈగలు, దోమలు ముసురుతుండటం వంటి దారుణమైన లోపాలు బయటపడ్డాయి. వీటితో పాటు ఆహార తయారీ సిబ్బంది కనీస నిబంధనలైన హెడ్ క్యాప్స్, గ్లవ్స్ మరియు ఆప్రాన్లు లేకుండా పనులు చేయడం, నిల్వ ఉంచిన మసాలాలు, అల్లం-వెల్లుల్లి పేస్టులను సరైన నిర్వహణ లేకుండా ఈగలు వాలుతున్న చోట ఉంచడం గమనించినట్లు అధికారులు వెల్లడించారు.

**మార్పులు చేసే వరకు అనుమతి లేదు..**

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఈ తీవ్రమైన ఉల్లంఘనలను దృష్టిలో ఉంచుకొని, సదరు రెస్టారెంట్‌ను తక్షణమే తాత్కాలికంగా మూసివేయించినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అంకిత్ రెడ్డి స్పష్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ శాఖ నిబంధనల ప్రకారం సూచించిన అన్ని మార్పులు పూర్తి చేసి, శుభ్రత పాటించిన తర్వాత మాత్రమే రెస్టారెంట్‌ను తిరిగి ప్రారంభించేందుకు అనుమతి ఇస్తామని యాజమాన్యానికి హెచ్చరించారు. అదేవిధంగా మంథని మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని పలు కిరాణా దుకాణాలను కూడా అధికారులు తనిఖీ చేశారు. గడువు ముగిసిన వస్తువుల అమ్మకాలపై మండిపడ్డారు. నాణ్యత పరిశీలన కొరకు ప్రయోగశాల (ల్యాబ్) పరీక్షల కోసం వివిధ ఆహార నమూనాలను సేకరించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు.



# జిల్లాలో నిరంతర నెట్‌వర్క్ సేవలు అందించాలి

- **వినియోగదారులకు ఆటంకాలు లేకుండా నాణ్యమైన సిగ్నల్స్ ఇవ్వాలి: అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్**
- **మరమ్మతులకు ముందు 'కాల్ బిఫోర్ యూ డిగ్' యాప్‌లో వివరాలు నమోదు చేయాలి**
- **కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి టెలికాం కమ్యూనికేషన్ కమిటీ సమావేశం**




**సిద్ధిపేట, (మనసులో మాట):** సిద్ధిపేట జిల్లావ్యాప్తంగా ఇంటర్నెట్, మొబైల్ వినియోగదారులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా టెలికాం సంస్థలు నాణ్యమైన నెట్‌వర్క్ సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆదేశించారు. శుక్రవారం సిద్ధిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ)లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి టెలికాం కమ్యూనికేషన్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టెలికాం సేవల విస్తరణ, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా నెట్‌వర్క్ సమస్యలు తలెత్తకుండా, సెల్ టవర్ల సిగ్నల్ అంతరాయాలు లేకుండా టెలికాం ప్రతినిధులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా కేబుల్ లైన్ల అండర్ గ్రౌండ్ పనులు, సాంకేతిక లోపాల మరమ్మతులు చేపట్టేందుకు ముందుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "కాల్ బిఫోర్ యూ డిగ్" (Call Before You Dig) యాప్‌లో సంబంధిత వివరాలను విధిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయడం వల్ల ఇతర ప్రభుత్వ శాఖల అధికారులకు ముందస్తు సమాచారం అందుతుందని, తద్వారా లైన్లు తెగిపోకుండా నివారించవచ్చన్నారు. అలాగే ప్రజలకు కూడా సేవల అంతరాయం గురించి ముందుగానే అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయం అవసరం..

టెలికాం సంస్థల ప్రతినిధులు మున్సిపల్, విద్యుత్, ఆర్అండ్‌బీ వంటి ప్రభుత్వ శాఖలతో పూర్తి సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు జరిగేటప్పుడు కేబుల్స్ దెబ్బతినకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గిరిజన, మారుమూల గ్రామాల్లో సైతం నెట్‌వర్క్ కనెక్టివిటీని పెంచేందుకు ప్రైవేట్, ప్రభుత్వ టెలికాం సంస్థలు కృషి చేయాలని ఆదేశించారు. ఈ జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా అధికారులు వెంకటరెడ్డి, గణేష్ రామ్, రాజ్ కుమార్, జయదేవ్ ఆర్యతో పాటు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ తదితర టెలికాం సంస్థల ప్రతినిధులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

# ఘన వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి




- **సుప్రీం కోర్టు నూతన మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలి: కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక**
- **కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి; బల్క్ వేస్ట్ జనరేటర్లపై ప్రత్యేక పర్యవేక్షణ**
- **కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ మానిటరింగ్ కమిటీ తొలి సమావేశం**

**నారాయణపేట(మనసులో మాట):** జిల్లాలో ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సి. హెచ్. ప్రియాంక ఐఏఎస్ అధికారులను సూచించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని వీసీ (వీడియో కాన్ఫరెన్స్) హాల్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలపై జిల్లా మానిటరింగ్ కమిటీ తొలి సమావేశాన్ని అత్యున్నత స్థాయిలో నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇటీవలే జారీ చేసిన ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నాలుగు ముఖ్యమైన విధానాల మార్గదర్శకాలను జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో అధికారులు సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆమె ఆదేశించారు. వ్యర్థాల సేకరణ, తరలింపు ప్రక్రియలో నిరంతరం పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా శాస్త్రీయ విధానంలో సురక్షిత చెత్త నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో, అలాగే ప్రతి మండల కేంద్రంలో భారీ స్థాయిలో వ్యర్థాలను ఉత్పత్తి చేసే 'బల్క్ వేస్ట్ జనరేటర్లను' (కళ్యాణ మండపాలు, పెద్ద హోటళ్లు, వ్యాపార సంస్థలు) ప్రత్యేకంగా గుర్తించి, వారి వ్యర్థాల పారబోతపై కఠిన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

**బయో మైనింగ్ అనుమతులపై చర్చ..**

ఈ సమీక్షా సందర్భంగా నారాయణపేట, మక్తల్, కోస్గి మున్సిపాలిటీలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న డంపింగ్ యార్డుల స్థితిగతులు, వాటిలో నిల్వ ఉన్న తడి-పొడి చెత్త వేరుచేయడం, పేరుకుపోయిన పాత చెత్తను తొలగించేందుకు అవసరమైన బయో మైనింగ్ ప్రక్రియ అనుమతుల గురించి సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజినల్ అధికారి సురేష్, డీపీఓ సుధాకర్ రెడ్డి, డీఈఓ గోవిందరాజులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) జయచంద్రమోహన్, సెక్షన్ అధికారిని జయసుధ, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, పర్యావరణ ఇంజనీర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.